ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 165 బుధవారం 03 - 06 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 165 Wednesday 03 - 06 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

# తెలంగాణ కోటి రత్నాలవీణ

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తెలంగాణ సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం
- తెలంగాణ విజన్-2047 లక్ష్యం సాధించే దిశగా వెళ్తున్నాం
- రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం
- తెలంగాణ విజన్-2047 లక్ష్యం సాధించే దిశగా వెళ్తన్నామని వెల్లడి
- ఎదలను అద్దె ఇళ్ల బాధల నుంచి విముక్తి చేయాలని నిర్ణయించామన్న సీఎం
- పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



**వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 02 :**
రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ కోటి రత్నాలవీణ అన్న రేవంత్ రెడ్డి, పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది అన్న కాళోజీ మాటలను గుర్తు చేశారు. కాళోజీ స్ఫూర్తితో అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర హితం కోసం శ్రమిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ కల సాకారం చేసిన నాటి ప్రధాని మన్మోహన్, సోనియా గాంధీకి ధన్యవాదాలు తెలిపారు.సంక్షేమం, అభివృద్ధికి ఈ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం వెల్లడించారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం సహించదన్న రేవంత్, ప్రభుత్వం అంటే నలుగురి - మిగతా 2 లో



## ఓట్ల గల్లంతుపై మీడియా దృష్టి పెట్టాలి

- తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- అర్హులైన వారి ఓట్లు గల్లంతు కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న మల్లు భట్టి
- రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రత్యర్థులే లేరని వ్యాఖ్య
- బీజేపీ రైతు వ్యతిరేక పార్టీ అని విమర్శ

**వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 02 :**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై మీడియా ప్రత్యేక దృష్టి పెట్టాలని, అర్హులైన వారి ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాల్సిన - మిగతా 2 లో

## ట్యాంక్ బండ్‌పై ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



- తెలంగాణ రాష్ట్ర సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- జయశంకర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్న కవిత
- అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్
- డిమాండ్లను నెరవేర్చకపోతే భారీ ఉద్యమం చేస్తామని హెచ్చరిక

**వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 02 :**
తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి రోజైన ఆగస్టు 6వ తేదీ లోపు హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని తెలంగాణ రాష్ట్ర సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. - మిగతా 2 లో

## భారత్‌లో ఎబోలా కేసులు లేవు.. కానీ!

- కేంద్రం కీలక అడ్వైజరీ
- అంతర్జాతీయ ప్రయాణికుల కోసం కేంద్ర ఆరోగ్య శాఖ మార్గదర్శకాలు
- ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించడంతో అప్రమత్తత
- ఈ వైరస్‌కు టీకాలు లేకపోవడంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన




**వార్త సంధ్య, ఢిల్లీ, జూన్ 02 :**
భారతదేశంలో ఇప్పటివరకు ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అయితే, కొన్ని ఆఫ్రికా దేశాల్లో ఈ వైరస్ వ్యాప్తి తీవ్రమవుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా అంతర్జాతీయ ప్రయాణికుల కోసం - మిగతా 2 లో

## రెండుగా విడిపోయిన యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్

- గుత్తి స్టేషన్‌లో విడిపోయిన యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ బోగీలు
- లోకో పైలట్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం



**వార్త సంధ్య, అమరావతి, జూన్ 02 :**
ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో యశ్వంత్‌పూర్-కతిహార్ ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. గుత్తి రైల్వే స్టేషన్‌లో రైలు బోగీలు అకస్మాత్తుగా విడిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే, లోకో పైలట్ - మిగతా 2 లో

## నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై భారత్ ఘాటు స్పందన



- భారత్-నేపాల్ సరిహద్దు వివాదంలో మూడో దేశం జోక్యం కుదరదని స్పష్టం చేసిన భారత్
- ఇది పూర్తిగా ద్వైపాక్షిక అంశమని భారత విదేశాంగ శాఖ వెల్లడి
- భారత్, నేపాల్ పరస్పరం భూభాగాలు ఆక్రమించుకున్నాయన్న నేపాల్ ప్రధాని వ్యాఖ్యలు
- ద్వైపాక్షిక చర్చలకే కట్టుబడి ఉన్నామని భారత్ స్పష్టీకరణ

**వార్త సంధ్య, ఢిల్లీ, జూన్ 02 :**
భారత్, నేపాల్ మధ్య ఉన్న సరిహద్దు వివాదం పూర్తిగా ద్వైపాక్షిక అంశమని, ఇందులో మూడో దేశం ప్రమేయానికి ఆస్కారమే లేదని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యలను చర్చల ద్వారా, చారిత్రక ఆధారాల ప్రాతిపదికన పరిష్కరించుకోవాలని పేర్కొంది.నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఇటీవల పార్లమెంటులో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ స్పందించింది. సరిహద్దు సమస్య పరిష్కారానికి భారత్, చైనాలతో మాట్లాడడమే కాకుండా, - మిగతా 2 లో

## వన్‌టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదు మళ్లీ గెలవాలి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- పవర్ ఆఫ్ సైకిల్ చాటేందుకు నెలలో కొన్ని రోజులు సైకిల్‌పై వెళ్తానన్న సీఎం
- సైకిల్ పవర్ చూపించేందుకు ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ సైకిల్ వాడండని సూచన



**వార్త సంధ్య, అమరావతి, జూన్ 02 :**
చిన్న పామైనా పెద్ద కర్రతో కొట్టాలనే సామెత తరహాలో గొడ్డలి పార్టీ విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. లేకుంటే విషం చిమ్ముతూనే ఉంటుందని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. తాను ఎన్నో పోరాటాలు చేశానని కానీ నీచులతో ఎప్పుడూ పోరాటాలు చేయలేదని అన్నారు. పార్టీ పెట్టినప్పటి నుంచి హిందూపురం, కుప్పం సహా ఇంకొన్ని నియోజకవర్గాల్లో గెలుస్తూనే ఉన్నాం.. ఇలాంటి నియోజకవర్గాల సంఖ్య పెరగాలని సూచించారు. కొత్తగా ఎమ్మెల్యేలు అయిన వారు వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదని మళ్లీ మళ్లీ గెలవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి, సుపరిపాలన - మిగతా 2 లో


2 లో

## ప్రపంచంలో అతి పెద్ద పాము ఇదే!

- 30 అడుగుల పొడవు, 250 కిలోల బరువు గ్రీన్ అనకొండ
- అమెజాన్ నదికి అసలు రూపం... అనకొండను దైవంగా కొలిచే గిరిజనులు
- ప్రపంచంలోనే అత్యంత బరువైన పాము... అనకొండ వెనుక ఆధ్యాత్మిక రహస్యం

## నాకు ఆంధ్రాలోనే ముఖ్యమంత్రి అయ్యే దిక్కులేదు


- జనసేన అధినేత పవన్ కల్యాణ్
- హైదరాబాదులో పవన్ ప్రెస్ మీట్
- తాను రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నించడంలేదని స్పష్టీకరణ
- కొందరు కావాలనే ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆగ్రహం
- బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని ఉద్ఘాటన



**వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 02 :**
"నాకు ఆంధ్రప్రదేశ్‌లోనే ముఖ్యమంత్రి అయ్యే దిక్కు లేదు, ఇక తెలంగాణలో ఎందుకు అవుతాను" అంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ తనపై వస్తున్న విమర్శలకు ఘాటుగా బదులిచ్చారు. తెలంగాణలో రాజకీయ లబ్ధి కోసమే తాను ప్రయత్నిస్తున్నానంటూ కొందరు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పవన్ మాట్లాడుతూ, తనను, జనసేనను లక్ష్యంగా చేసుకుని కొందరు పనిగట్టుకుని ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు."భారత రాష్ట్ర సమితిని కేసీఆర్ గారు ఆంధ్రాలో ప్రారంభించినప్పుడు, నేను మనస్ఫూర్తిగా స్వాగతించాను. ఒక రాజకీయ పార్టీని దేశంలో ఎక్కడైనా పెట్టుకోవచ్చు. గుంటూరులో బీఆర్ఎస్ కార్యాలయం పెట్టి, జనసేనలో పనిచేసిన నాయకుడిని అధ్యక్షుడిగా నియమించినా నేను ఆహ్వానించాను. అలాంటప్పుడు, జనసేన తెలంగాణలో అడుగుపెట్టకూడదు అనడం ఎంతవరకు సబబు - మిగతా 2 లో

## మెగాసిటీగా మారేలా రాజమహేంద్రవరం అభివృద్ధి పనులు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- గోదావరి పుష్కరాలపై వివిధ శాఖలతో సీఎం చంద్రబాబు సమీక్ష
- అఖండ గోదావరి ప్రాజెక్టుపై మంత్రుల కమిటీతో సమగ్రంగా చర్చించిన సీఎం
- పవన్ కల్యాణ్ సూచనలు కూడా పరిగణనలోకి తీసుకుని పనిచేయాలని ఆదేశం



**వార్త సంధ్య, అమరావతి, జూన్ 02 :**
గోదావరి పుష్కరాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్నిశాఖలు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. గోదావరి పుష్కరాల నిర్వహణపై, సీఎం వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గోదావరి నది రాష్ట్రంలో 212 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తోందని పోలవరం జిల్లా గుండాలలో మొదటి పుష్కర ఘాట్, కోనసీమ జిల్లా అంతర్వేది, బలుసుతిప్ప, కాకినాడలోని గోవాలంక, పశ్చిమగోదావరిలోని నర్సాపురంలో చివరి ఘాట్ నిర్మాణ ప్రతిపాదనలు చేసినట్లు అధికారులు వివరించారు. మొత్తం 6జిల్లాల్లో 525 ఘాట్లను పుష్కరాల కోసం సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న 288 ఘాట్లతో సహా కొత్తగా 237 ఘాట్లను నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ సారి పుష్కరాల్లో పుణ్య స్నానాల కోసం 9 నుంచి 10 కోట్లమంది భక్తులు వస్తారని అంచనా వేశారు.మెగాసిటీగా రాజమహేంద్రవరం: పుష్కర ఘాట్లు, రోడ్లు, టెంట్లు, మరుగుదొడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం - మిగతా 2 లో

# సంపాదకీయం

## ‘శైశవ గీతి’ నిండుగా..!

వ్యత్యాసాలు బాగా తగ్గించగలిగే వృద్ధే లక్ష్యం కావాలి. తేడాలు విపరీతంగా ఉన్న ప్రగతి నిరర్థకమవుతుంది, కొత్త సమస్యలకు దారితీస్తుంది. జనాభా గణాంకాలపై శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్)--2024 నివేదిక శిశు మరణాలను తగ్గించడంలో పురోగతిని నమోదు చేసింది. ఇది సంతృప్తికరమే అయినప్పటికీ సాధించిన సత్ఫలితాలు సమరీతిలో లేవన్న వాస్తవాన్ని ఉపేక్షించకూడదు. పుట్టిన పాపాయి మొదటి పుట్టిన రోజును జరుపుకోకుండానే తల్లిదండ్రులకు, ఈ లోకానికి శాశ్వతంగా దూరం కావడమే శిశు మరణం. ప్రతి 1000 సజీవ జననాలలో మొదటి సంవత్సరంలో సంభవించే మరణాలను శిశుమరణాల రేటుగా పరిగణిస్తారు. మానవ జీవన నాణ్యతకు ఇదొక ప్రధాన సూచిక. ఎందుకంటే ఒక సమాజపు జీవన ప్రమాణాలకు అది అద్దం పట్టుతుంది. శిశు మరణాల రేట్లు అధికంగా ఉండడమనేది అనేక వైఫల్యాలకు తార్కాణం. అవి సాధ్యమైనంత తక్కువగా ఉండడం, లేదా అసలు లేకపోవడమనేది అభిలషణీయమే కాదు, అనివార్య కర్తవ్యం కూడా. ప్రామాణిక ఆరోగ్య భద్రతా సదుపాయాలు; ప్రసవ పూర్వం, ప్రసవ సమయంలోను, ఆ తరువాత తల్లికి, నవజాత (మొదటి నెల రోజుల పాటు) శిశువుకు అందించే వైద్య సంరక్షణ; తల్లికి, బిడ్డకు పోషకాహార లభ్యత, పారిశుద్ధ్యం, పేద కుటుంబాల మహిళలకు ఆర్థిక, సామాజిక మద్దతు మొదలైనవాటికి శిశు మరణాల రేటు తగ్గింపులో నిర్ణయాత్మక పాత్ర ఉన్నది. ఈ కారణంగానే శిశు మరణాల రేటును మానవ జీవననాణ్యతకు ఒక గీటురాయిగా పరిగణిస్తున్నారు. శిశు మరణాల రేటు తగ్గుదల సమాజాల పురోగతికి నిదర్శనంగా ఉన్నది. పారిశ్రామిక విప్లవానికి పూర్వం ప్రపంచవ్యాప్తంగా అన్ని సమాజాలలోను శిశు మరణాల రేటు చాలా అత్యధికంగా ఉన్నదనేది ఒక క్రూర వాస్తవం. యూరోప్‌లో వైజ్ఞానిక పరిశోధనలు శిశు మరణాల తగ్గుదలకు ఇతోధిక దోహదం చేశాయి. అయినప్పటికీ 1850 నాటికి కూడా యూరోప్, అమెరికాలో శిశు మరణాల రేటు వందల సంఖ్యలో ఉండేది. ఆ తరువాతనే వాటి తగ్గుదలలో శీఘ్ర పురోగతి సంభవించి, ఇప్పుడు ఆ రేటు 5, అంతకంటే తక్కువగా ఉండడం సాధ్యమయింది. ఆ సంపన్న సమాజాలలోని ఈ అల్ప శిశుమరణాల రేటులో సైతం అక్కడి ఆర్థిక అసమానతలు ప్రతిబింబిస్తున్నాయనేది విస్మరించలేని వాస్తవం. మరి స్వతంత్ర భారతదేశంలో శిశు మరణాల తగ్గుదల అంత వేగవంతంగా లేకపోవడంలో ఆశ్చర్యం లేదు. ఐదున్నర దశాబ్దాల క్రితం కూడా మన దేశంలో శిశు మరణాల రేటు (ప్రతి 1000 సజీవ జననాలకు) 129గా ఉండేది. ఇది ఇప్పుడు అంటే 2024 సంవత్సరం నాటికి 24కి తగ్గిందని ఎస్ఆర్ఎస్ తాజా నివేదిక వెల్లడించింది. 2014--19 సంవత్సరాల మధ్య 39గా ఉన్న ఈ రేటు ఐదేళ్లలో 24కి తగ్గడం చెప్పుకోదగిన శుభ పరిణామమే, సందేహం లేదు. ప్రజారోగ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వాలు దశాబ్దాలుగా చేస్తున్న భారీ వ్యయాల కారణంగానే ఈ పురోగతి ఫలించింది. అయితే శిశు మరణాల తగ్గుదలలో రాష్ట్రాల వారీగా, ప్రాంతాల వారీగా అంతరాలు ఉన్నాయి. కేరళలో 8కి, తమిళనాడు, ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్‌లో 11కు అవి తగ్గిపోయాయి. ఈ సంతృప్తికర పరిస్థితికి విరుద్ధంగా ఛత్తీస్‌గఢ్‌లో 36గా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో 35 చొప్పున శిశుమరణాల రేటు నమోదయింది. గ్రామీణ పట్టణ ప్రాంతాల మధ్య కూడా ఇటువంటి తేడా స్పష్టంగా కనిపిస్తోంది. 2024 గణాంకాల ప్రకారం ప్రతి 1000 సజీవ జనాలకు గ్రామీణ సీమలలో 27, పట్టణ ప్రాంతాలలో 17 మరణాలు సంభవిస్తున్నాయి. ఈ వ్యత్యాసాలు సూచిస్తున్నదేమిటి? మన ప్రజల, ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల పేదల జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు మరింత దూరం ప్రయాణించవలసి ఉందనే కాదూ? తల్లీ బిడ్డల శ్రేయస్సుకు ఉద్దేశించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాలను మరింత చిత్తశుద్ధితో అమలుపరచినప్పుడు మాత్రమే ఆ వ్యత్యాసాలు తొలగిపోతాయి. పాపాయిలు ఆరోగ్యకరమైన వ్యక్తులుగా ఎదిగేందుకు పుట్టిన మొదటి సంవత్సరంలో అందుకు దృఢమైన పునాది వేసేందుకు కూడా ప్రాధాన్యమివ్వాలి. శిశు మరణాల తగ్గింపు కృషి కొనసాగింపుగానే కాకుండా అందులో భాగంగా కూడా ఇది జరగాలి. పుట్టిన ప్రతి బిడ్డ మనుగడలో శ్రీశ్రీ ‘శైశవ గీతి’ నిండుగా ప్రతిఫలించడమే సార్థకమైన పాపాయి ప్రగతి అవుతుంది.

## రెండుగా విడిపోయిన యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్

**మొదటిపేజీ తరువాయి -** అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ముప్పు తప్పి అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. యశ్వంత్‌పూర్ నుంచి కతిహార్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు గుత్తి స్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌పైకి వస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. రైలులోని ఎస్6, ఎస్7 కోచ్‌ల మధ్య ఉన్న జాయింట్ కప్లింగ్ ఊడిపోవడంతో వెనుక ఉన్న బోగీలు రైలు నుంచి విడిపోయాయి. దీన్ని వెంటనే గమనించిన లోకో పైలట్, వేగాన్ని నియంత్రిస్తూ చాకచక్యంగా బ్రేకులు వేశారు. దీంతో విడిపోయిన బోగీలు నెమ్మదిగా వచ్చి ముందున్న రైలును తాకడంతో పెను ప్రమాదం జరగలేదు. ఈ ఘటనలో ప్రయాణికులెవరికీ ఎలాంటి గాయాలు కాలేదని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. రైల్వే సిబ్బంది వెంటనే విడిపోయిన బోగీలను తిరిగి జత చేసి, పూర్తిస్థాయిలో భద్రతా తనిఖీలు నిర్వహించారు. అనంతరం రైలు సుమారు 30 నిమిషాల ఆలస్యంగా గమ్యస్థానానికి బయలుదేరి వెళ్లింది. సాంకేతిక కారణాల వల్లే కప్లింగ్ విడిపోయి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. సిబ్బంది సత్వర స్పందనతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై భారత్ ఘాటు స్పందన



**మొదటిపేజీ తరువాయి -** యూకే ప్రభుత్వంతో కూడా మాట్లాడామని చెప్పారు. యూకే ప్రభుత్వం కూడా దీనిపై దృష్టిసారించాలని కోరుకుంటున్నామని, ఎందుకంటే, భారత్ ను బ్రిటీషర్లు పరిపాలించిన చరిత్రతో ఈ సమస్యకు సంబంధం ఉందని వివరించారు. అంతేకాకుండా, భారత్ తమ భూభాగంలోకి చొరబడినట్లే, నేపాల్ కూడా కొన్ని ప్రాంతాల్లో భారత భూభాగాలను ఆక్రమించుకుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు నేపాల్ పార్లమెంటులో తీవ్ర దుమారం రేపాయి. ప్రభుత్వ వైఖరిని బలహీనపరిచారంటూ ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. దీంతో నేపాల్ విదేశాంగ శాఖ వెంటనే రంగంలోకి దిగి వివరణ ఇచ్చింది. ప్రధాని వ్యాఖ్యలు సరిహద్దులోని ‘దస్‌గజ’ (నో-మ్యాన్స్ ల్యాండ్) ప్రాంతంలో ఇరు దేశాల పౌరుల భూ వినియోగానికి సంబంధించినవని, అధికారిక ప్రాదేశిక వాదనలకు కాదని పేర్కొంది. లిపులేఖ్, కాలాపానీ, లింపియాధురా విషయంలో తమ అధికారిక వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, ద్వైపాక్షిక చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకుంటామని స్పష్టం చేసింది. 1816 నాటి సుగౌలీ ఒప్పందం ప్రకారం కాలాపానీ, లిపులేఖ్, లింపియాధురా తమవేనని నేపాల్ వాదిస్తుండగా, ఆ ప్రాంతాలు ఉత్తరాఖండ్‌లో భాగమని భారత్ పేర్కొంటోంది. తాజాగా నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై స్పందించిన భారత్, ఏ దేశం మధ్యవర్తిత్వాన్నయినా తిరస్కరిస్తూ, ఇది కేవలం రెండు దేశాల మధ్య పరిష్కారం కావాల్సిన అంశమని తేల్చిచెప్పింది.

## ఓట్ల గల్లంతుపై మీడియా దృష్టి పెట్టాలి



**మొదటిపేజీ తరువాయి -** బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఈ ‘ఎస్ఐఆర్ మ్యాపింగ్’ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని ఆయన కోరారు. సచివాలయంలో జరిగిన తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల అనంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలపై ఆయన కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అసలు ప్రత్యర్థులే లేరని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ తీరును తప్పుబడుతూ.. “భారతీయ జనతా పార్టీ పక్కా రైతు వ్యతిరేక పార్టీ” అని ఆయన దుయ్యబట్టారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే ప్రభుత్వాలకు, పార్టీలకు ప్రత్యేకంగా ప్రచారం అవసరం లేదని.. తాము చేసిన పనులే మాట్లాడతాయని చెప్పారు. ఇప్పటికే జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన సత్తా ఏంటో నిరూపించుకుందని ఆయన గుర్తుచేశారు. ఇదే క్రమంలో అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం త్వరలోనే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుంటుందని భట్టి విక్రమార్క వెల్లడించారు.

## వన్‌టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదు మళ్లీ గెలవాలి




**మొదటిపేజీ తరువాయి -** ద్వారానే ఓట్లు పడతాయన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చి మొదటి సంతకం పెట్టి మెగా డీఎస్సీ నిర్వహించామని సీఎం గుర్తుచేశారు. మెగా డీఎస్సీ జరగకూడదని 241 కేసులు వేసి అడ్డుకున్నారని, కానీ వాటిని ఎదుర్కొని అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి నియామకాలు పూర్తి చేశామన్నారు. పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గట్టిగా కౌంటర్లు ఇస్తే ఇప్పుడు తోకముడిచారని అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని టీడీపీ ఎమ్మెల్యేలకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. జనసేన, భాజపాతో కలిసి సమన్వయం చేసుకొని ‘సర్’ని పర్యవేక్షించాలన్నారు. టీడీపీ ప్రధాన పార్టీగా ఉన్నందున పూర్తి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ‘సర్’పై తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలకు చంద్రబాబు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ తరగతులకు హాజరుకాని నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. “రాష్ట్రంలో 2002 తర్వాత ఓటర్ల జాబితా సవరణ జరుగుతోంది. మన ఓట్లు తీసేసి వాళ్ల ఓట్లు పెట్టేలా కుట్రలకు గొడ్డలి పార్టీ వెనుకాడదు. ‘సర్’ సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. మాకేం సంబంధం లేదన్నట్లుగా ఎంపీలు ఉంటే సరికాదు. జులై 14 లోపు ఓట్లు ఉండేలా చూసుకోకపోతే ఇబ్బందులు ఎదురవుతాయి. పార్టీ ఉంటేనే ప్రభుత్వం వస్తుందనే బాధ్యతతో ప్రతి ఒక్కరూ పని చేయాలి. పవర్ ఆఫ్ సైకిల్ చాటేందుకు నెలలో కొన్ని రోజులు సైకిల్‌పై వెళ్దాం. సైకిల్ పవర్ చూపించేందుకు ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ సైకిల్ వాడండి. దీని వల్ల ఖర్చు సున్నా, ఆరోగ్యానికి ఆరోగ్యం. ఎలక్ట్రిక్ సైకిల్‌పై వీలైనన్ని ఎక్కువ ఇళ్లకు తిరుగుదాం. ఈ నెల 4న ఎన్డీయే సమావేశం తర్వాత భవిష్యత్ కార్యాచరణ చేపడతాం. 2024లో కూటమికి వచ్చిన ఓట్ల కంటే వచ్చే ఎన్నికల్లో పెరగాలి. ప్రతి బుధవారం పార్టీ క్యాలెండర్ తప్పనిసరిగా అమలు కావాలి” అని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## నాకు ఆంధ్రాలోనే ముఖ్యమంత్రి అయ్యే దిక్కులేదు

**మొదటిపేజీ తరువాయి -** మేమేమైనా తెలంగాణలో పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అవుతాడని అడుగుతున్నామా? ఆంధ్రాలోనే దిక్కులేని నాకు అక్కడ ఆశ ఎందుకు ఉంటుంది? నిజానికి వాళ్లకున్న భయమల్లా ఒక్కటే. జనసేన వస్తే ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తుందనే భయం. సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తుందనే భయం. కేవలం 2000 మందితో సభ పెట్టుకుంటామంటే కూడా పర్మిషన్ ఇవ్వకపోతే మేం ఏం చేయాలి? దుర్మార్గాలు చేయమంటారా? నేను అమిత్ షా గారి గురించి మాట్లాడితే, దానికి ప్రాంతీయత, కులం రంగులు పులిమి నన్ను అవమానిస్తారా? మీ ఇష్టానికి మీరు మాట్లాడితే, కనీసం బాధపడే హక్కు కూడా మాకు లేదా? మేం ఇంకా “బాంచన్ దొర, నీ కాళ్లు మొక్కుతా” అని బతకాలా? పీకలు కోసుకుంటాం కానీ అలాంటి భయంతో బతకలేం. తెలంగాణలో ఆంధ్ర కాంట్రాక్టర్లు, ఆంధ్రాలో తెలంగాణ కాంట్రాక్టర్లు బాగున్నారు. వాళ్ల వ్యాపారాలు, అధికారాలు అన్నీ బాగున్నాయి. మధ్యలో నాలాంటి వాడిని మాట్లాడనివ్వకుండా చేసి, ప్రజలను బేవకూఫ్‌లను చేస్తున్నారు. ఇది తెలంగాణ ప్రజలు గమనించాలి. నిజంగా నేను తెలంగాణకు రావొద్దని మీరు అనుకుంటే, అసెంబ్లీలో తీర్మానం పెట్టండి. పవన్ కళ్యాణ్ ఇక్కడ అడుగుపెట్టకూడదని తీర్మానం చేయండి. ఎలా చేస్తారో నేను కూడా చూస్తా. తెలంగాణ ఉద్యమంలో 1200 మందికి పైగా యువత ప్రాణాలు అర్పించారు. వాళ్లంటే నాకు ఎంతో గౌరవం. తెలంగాణ అంటే నాకు ప్రాణం. కానీ మీరు నా ప్రేమనే శంకిస్తున్నారు. అందుకే, ఇప్పటిదాకా తీసుకోని నిర్ణయం ఇప్పుడు తీసుకుంటున్నా. తెలంగాణలో జనసేన ఉంటుంది. మేం పోటీ చేస్తాం. నేనే స్వయంగా తిరుగుతా. ప్రతి సమస్యపై మాట్లాడుతాం. ప్రతి అన్యాయాన్ని ఎదుర్కొంటాం. తెలంగాణ భారతదేశంలో అంతర్భాగం అని మర్చిపోకండి. బెదిరిస్తే భయపడటానికి మేం సిద్ధంగా లేము. దశాబ్దాలుగా భరించాం, ఇక చరమగీతం పాడతాం. విచిత్రం ఏంటంటే, ఒకప్పుడు తెలంగాణను వ్యతిరేకించిన వాళ్లే ఈరోజు అక్కడ పదవుల్లో కూర్చున్నారు” అని ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ఉద్యమం ఊపందుకోక ముందు నుంచే తనకు ఇక్కడి సంస్కృతి, పోరాట స్ఫూర్తి అంటే ఎంతో ఇష్టమని, దానిని తన సినిమాల్లోనూ చూపించానని గుర్తుచేశారు. కొందరు నాయకులు తనను భౌతికంగా అడ్డుకుంటామని, దాడులు చేస్తామని బెదిరిస్తున్నారని, అలాంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని పవన్ హెచ్చరించారు. చావుకు సిద్ధపడే పార్టీ పెట్టానని అన్నారు. ప్రాంతీయ విద్వేషాలు దేశ సమగ్రతకు ఉగ్రవాదం కంటే ప్రమాదకరమని పవన్ ఆందోళన వ్యక్తం చేశారు. “ఉపాధి లేకపోతే, పరిశ్రమలు రాకపోతే దానికి ఆంధ్రోళ్లే కారణం అన్నట్టు మాట్లాడటం సరికాదు. నాయకుల మధ్య ఉండే విభేదాలను ప్రజలకు అంటించవద్దు” అని హితవు పలికారు.

## మెగాసిటీగా మారేలా రాజమహేంద్రవరం అభివృద్ధి పనులు



**మొదటిపేజీ తరువాయి -** పనులు చేపట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలనీ సీఎం ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, శానిటేషన్, తాగునీరు, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించి చేసిన సూచనల్ని పరిగణనలోకి తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. పుష్కరాల నిర్వహణతో పాటు రాజమహేంద్రవరం ఒక మెగాసిటీగా అభివృద్ధి అయ్యేలా పనులు చేపట్టాలని సూచించారు. కేవలం పుష్కరాలకు మాత్రమే పనులు పరిమితం చేయకుండా ప్రస్తుతం కల్పిస్తోన్న మౌలిక వసతులు గోదావరి పరివాహక ప్రాంతానికి ఆస్తిగా మారాలన్నారు. పోలవరం, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పుష్కరాల పనులు చేపట్టాలన్నారు. రాజమహేంద్రవరం, నర్సాపురం సహా వివిధ ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ పరిధిలో రూ. 1,974 కోట్ల వ్యయంతో 1,660 పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో రూ. 1,080 కోట్ల విలువైన 1140 పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ‘ అఖండ గోదావరి అభివృద్ధి ప్రాజెక్టుపై మంత్రుల కమిటీతో పాటు వివిధ శాఖల అధికారులతో చర్చించారు. 2027 గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గత పుష్కరాల్లో ఒక్క రోజులో అత్యధికంగా 58.26 లక్షల మంది భక్తుల పుష్కర స్నానం చేశారని ఈ సారి ఒక్కరోజులో 1 కోటి మంది పుణ్య స్నానాలు ఆచరిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

## భారత్‌లో ఎబోలా కేసులు లేవు.. కానీ!

**మొదటిపేజీ తరువాయి -** మార్గదర్శకాలను జారీ చేసింది. గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చిన వారు లేదా ఆ దేశాల మీదుగా ప్రయాణించిన వారు తమ ఆరోగ్యాన్ని స్వయంగా పర్యవేక్షించుకోవాలని సూచించింది. ఎబోలా ప్రభావిత దేశాల్లో ప్రయాణించినవారు స్వీయ నిర్బంధంలోకి వెళ్ళాలని సూచించింది. జ్వరం, తీవ్రమైన బలహీనత, కండరాల నొప్పి, తలనొప్పి, గొంతునొప్పి, వాంతులు, విరేచనాలు, దద్దుర్లు లేదా కారణం లేకుండా రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరింది. ముందస్తు సమాచారంతో మీ ప్రాణాలను కాపాడుకోవడంతోపాటు వ్యాధి వ్యాప్తిని కూడా నిరోధించవచ్చని తెలిపింది. అధికారుల సాయం కోసం హెల్ప్ లైన్ నెంబర్ 1075కు కాల్ చేయాలని సూచించింది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ), ఉగాండా, దక్షిణ సూడాన్‌లలో కొత్త రకం ఎబోలా వైరస్ వ్యాప్తి చెందుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) మే 17న దీనిని ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించింది. ఈ ప్రత్యేక వైరస్‌కు ప్రస్తుతం ఆమోదిత టీకాలు లేదా నిర్దిష్ట చికిత్సలు అందుబాటులో లేకపోవడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన పెంచుతోంది. ఈ పరిస్థితుల దృష్ట్యా భారత ప్రభుత్వం పలు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. డీఆర్‌సీ, ఉగాండా, దక్షిణ సూడాన్‌లకు అనవసర ప్రయాణాలు మానుకోవాలని పౌరులకు సూచించింది. విమానాశ్రయాలు, ఓడరేవుల్లో ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల స్క్రీనింగ్‌ను కట్టుదిట్టం చేసింది. వ్యాధి లక్షణాలు ఉన్నవారు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే ఎయిర్‌పోర్ట్ ఆరోగ్య అధికారులకు తప్పనిసరిగా రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా పరిస్థితిని సమీక్షించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి దేశంలో ఎలాంటి కేసులు లేనప్పటికీ, అంతర్జాతీయ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు ఆరోగ్య శాఖ వర్గాలు స్పష్టం చేశాయి.

## ప్రపంచంలో అతి పెద్ద పాము ఇదే!




**మొదటిపేజీ తరువాయి -** ప్రపంచంలోనే అత్యంత బరువైన పాముగా పేరుగాంచిన గ్రీన్ అనకొండ, అమెజాన్ వర్షాధార అడవుల్లో కేవలం ఒక జీవి మాత్రమే కాదు. అక్కడి ఆదివాసీ గిరిజన తెగలకు అదొక సృష్టికి మూలం, ఆరాధ్య దైవం, సంరక్షకుడు. శాస్త్రవేత్తలకు జీవ వైవిధ్య అద్భుతంగా కనిపించే ఈ భారీ సర్పం, స్థానిక సంస్కృతిలో ఆధ్యాత్మిక శక్తికి ప్రతీకగా నిలుస్తోంది. గ్రీన్ అనకొండ దాదాపు 30 అడుగుల పొడవు పెరిగి, సుమారు 250 కిలోల వరకు బరువు తూగుతుంది. బ్రెజిల్, పెరూ, కొలంబియా వంటి దేశాల్లోని నెమ్మదిగా ప్రవహించే నదులు, చిత్తడి నేలల్లో ఇది నివసిస్తుంది. విషపూరితం కానప్పటికీ, తన భారీ శరీరంతో మనుషులను, జింకలు, మొసళ్లు వంటి ప్రాణులను సైతం చుట్టేసి ఊపిరాడకుండా చేసి చంపి ఆహారంగా తీసుకుంటుంది. అమెజాన్‌లోని అనేక గిరిజన తెగలకు, అనకొండ అమెజాన్ నదికి జీవ రూపం. కొలంబియాలోని కొన్ని తెగల నమ్మకం ప్రకారం, ఒకప్పటి అనకొండ పడవే తొలి మానవులను నది వెంట మోసుకొచ్చి, వారికి భాషలు, సంప్రదాయాలు అందించిందని వారి పురాణ గాథలు చెబుతున్నాయి. బ్రెజిల్‌లోని దేశానా, తుకానో ప్రజలు దీనిని ‘ఫాదర్ ఆఫ్ గ్రాండ్ ఫాదర్’గా భావిస్తారు. పెరూలోని ఆదివాసులు దీనిని ‘యకుమామ’ (జలమాత)గా పిలుస్తూ, అడవిని కాపాడే దేవతగా కొలుస్తారు. అడవిని, పర్యావరణాన్ని గౌరవించని వారికి ఈ సర్పం గుణపాఠం చెబుతుందని నమ్ముతారు. ఈ నమ్మకాలు వారి సామాజిక కట్టుబాట్లను, పర్యావరణ పరిరక్షణ నియమాలను బలోపేతం చేస్తున్నాయి. ప్రస్తుతం అడవుల నరికివేత, కాలుష్యం కారణంగా అనకొండల మనుగడకు ముప్పు ఏర్పడు తోంది. ఐయూసీఎన్ దీనిని ఆందోళన అవసరంలేని జాబితాలో చేర్చినప్పటికీ, వాటి ఆవాసాలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని పర్యావరణవేత్తలు నొక్కి చెబుతున్నారు. అమెజాన్ జీవవైవిధ్యం, అక్కడి సాంస్కృతిక వారసత్వం ఒకదానితో ఒకటి ఎలా ముడిపడి ఉన్నాయో చెప్పడానికి అనకొండ ఉదాహ రణగా నిలుస్తోంది. శాస్త్రీయంగా చూస్తే, గ్రీన్ అనకొండ విషరహితమైనది. నీటిలో నెమ్మదిగా కదులుతూ చేపలు, జింకలు, మొసళ్ల వంటి పెద్ద జంతువులను సైతం చుట్టేసి చంపి ఆహారంగా తీసుకుంటుంది. ఆడ అనకొండలు మగవాటి కంటే గణనీయంగా పెద్దవిగా ఉంటాయి. 2024లో ఈక్వెడార్‌లో జన్యుపరంగా భిన్నమైన ‘నార్తర్న్ గ్రీన్ అనకొండ’ను కనుగొనడం ఈ జాతి ప్రాముఖ్యతను మరింత తెలియజేసింది. మొత్తంమీద, ఈ భారీ సర్పం అమెజాన్ జీవావరణ సమతుల్యతకు, సాంస్కృతిక వారసత్వానికి ఒక ప్రతీకగా నిలుస్తోంది.

## తెలంగాణ కోటి రత్నాలవీణ

**మొదటిపేజీ తరువాయి -** చేతిలో ఉండే పెత్తనం కాదని స్పష్టం చేశారు. తమది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వమన్న సీఎం, గత 30 నెలల్లో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విజయవంతం అయ్యామన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యం సాధించే దిశగా వెళ్తున్నామని స్పష్టం చేశారు. రైతులను వ్యవసాయ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకేసారి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తి చేశామని సీఎం తెలిపారు. తొలి ఏడాదిలోనే రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రైతుల పంటలు చివరి గింజ వరకు కొనేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు రూ.11,300 కోట్లు జమ చేశామని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం తెలిపారు. జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి మళ్లీ కృషి చేస్తున్నామని చెప్పారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందని సీఎం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు ఇచ్చామని చెప్పారు. తెలంగాణ మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు రూ.10 వేల కోట్లు ఆదా చేసుకున్నారన్న ముఖ్యమంత్రి, 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. న్యాయపరమైన సమస్యలు లేకుండా ఉద్యోగాలు భర్తీ చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అత్యంత పారదర్శకంగా 67 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా మరిన్ని నోటిఫికేషన్లు వస్తాయన్నారు. ఇందులో ఇంజినీరింగ్, పీసీబీ, అటవీ శాఖ, టౌన్ ప్లానింగ్, విద్యాశాఖలో ఉద్యోగాల నోటిఫికేషన్లు రానున్నట్లు వివరించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని హామీ ఇచ్చారు. పేదలకు సొంతిళ్లు సాకారం అనేది మాటల్లో చెప్పలేనిదని సీఎం అన్నారు. అద్దె ఇళ్ల బాధల నుంచి పేదలను విముక్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. 13 నెలల కాలంలో 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించామని వివరించారు. పేదల ఇళ్ల కోసం రూ.22 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ 3.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. ఈసారి క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని చెప్పారు. పేదలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్‌కార్డులను ఇచ్చామని వెల్లడించారు. “రెండున్నరేళ్లలో ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయం సాధించాం. రాష్ట్రంలో రైతుల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నాం. గత ప్రభుత్వం లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయింది. మరమ్మతులు చేయించే భారం ప్రభుత్వంపై పడింది. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను విజయవంతంగా చేపట్టాం. రికార్డు సమయంలో 67,763 పోస్టులను భర్తీ చేశాం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా విద్యా వ్యవస్థ మరి బలోపేతం కానుంది. పేదలను అద్దె బాధలనుంచి విముక్తి చేయాలన్న నిర్ణయం తీసుకున్నామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

## ట్యాంక్ బండ్‌పై ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై 12 ఏళ్లు పూర్తయినప్పటికీ, స్వరాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంతపరమైన వెన్నెముకగా నిలిచిన జయశంకర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ప్రభుత్వం ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడం తీవ్ర విచారకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ ప్రభుత్వం ఆగస్టు 6 లోపు విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైతే, కనీసం తమ పార్టీకైనా అనుమతి ఇవ్వాలని, తామే స్వయంగా ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఆమె స్పష్టం చేశారు. అలాగే తెలంగాణ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూనే, స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు, ఉద్యమకారులకు ఆమె ఘన నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సరైన గుర్తింపు, గౌరవం దక్కాలని ఆమె కోరారు. అలాగే జూలై 2వ తేదీ లోపు అమరవీరుల కుటుంబాలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ డిమాండ్లను నెరవేర్చకపోతే, తమ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్ భగాయత్ వేదికగా ఒక భారీ ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా, పెద్ద ఎత్తున వంటా-వార్పు నిరసన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తామని తెలిపారు. అమరవీరుల త్యాగాలను మరవకుండా ఉద్యమ స్ఫూర్తికి అనుగుణంగా పాలన సాగించాలని హితవు పలికారు.

## జూన్ 21న ఇందిరా పార్కులో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళన పోస్టర్ ఆవిష్కరణ.

**"తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి"**





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 2 :** తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు/ మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి పరిగి పట్టణం లో అనగా సోమవారం ఉదయం డాక్టర్ అంబేద్కర్ బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తాలో డాక్టర్ పిడమర్తి రవి తెలంగాణ ఉద్యమకారులు అడ్వకేట్ ఆనంద్ గౌడ్,జేఏసీ చైర్మన్ ముకుంద నాగేశ్వర్, తెలం గాణ విద్యావంతుల వేదిక వెంకట్ రాములు సార్,తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎర్రన్ పల్లి శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారుడు,సిపిఐ నాయకులు పీర్మహమ్మద్,ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు నక్క రమేష్ బాబు గార్ల చేతుల మీదుగా వాల్పోస్టర్ ఆవిష్కరించిన తరువాత ఈ సందర్భంగా వీరు ఇరువురు మాట్లాడుతూ ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అదేవిధంగా అర్హత గల ఉద్యమకారులకు పెన్షన్స్ మరియు నామినేటెడ్ పదవులలో మరియు పార్టీ పదవులలో అవకాశాలు కల్పించాలన్న డిమాండ్లతో జరిగే ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఉద్యమకారులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ సభ్యులు ఎర్రగడ్డ పల్లి గోపాల్,ఓయూ జేఏసీ నాయకులు రహీం,చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ శుభాకాంక్షలు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 2 :** భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన ఆర్టికల్ – 3ని ఉపయోగించుకుని, తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు ఆకాంక్షలు మరియు మనో భావాలకు అనుగుణంగా.. నీళ్లు నిధులు నియామకాలే కాకుండా.. ప్రాంతంగా విడిపోదాం, ప్రజలం గా కలిసుందాం అన్న గొప్ప ఆదర్శ నినాద సంకల్ప ప్రాతిపదికన, ఎంతోమంది అమరుల త్యాగాలతో చిరకాల ప్రత్యేక రాష్ట్రకల సాకారం చేసుకొని, ఆవిర్భావ వేడుకలు జరుపుకుంటున్న శుభసందర్భంలో, మన తెలుగు రాష్ట్రం, సోదర తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు మన ద్వారా తెలియజేస్తున్నాం. తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాలలో దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తయారవ్వాలని.. అందుకు రాజకీయాలను పక్కనబెట్టి రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా ఐక్యంగా సమిష్టిగా సంఘటితంగా కృషిచేయాలని, పాటుపడాలని.. అందుకు ఇరుగుపొరుగు రాష్ట్రాల సహకారం కూడా అవసరమైతే తీసుకోవాలని ఈ సందర్భంగా మరోమారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. తెలంగాణ ఆవిర్భావాభివందనాలతో..... (సంగటి మనోహర్ మహాజన్) ఈవీఎం వ్యతిరేక జాతీయ ఉద్యమనేత, వ్యవస్థాపక జాతీయ కన్వీనర్, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి/ ఆంధ్రప్రదేశ్ దక్షిణభారతదేశం ఇండియా – 9849509416

## రాష్ట్ర సమాచార హక్కు చట్టం సాధన కమిటీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులుగా కొడిప్యాక సాయిరాం పదోన్నతి




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 2 ( వార్తా సంధ్య) :** రాష్ట్ర సమాచార హక్కు చట్టం సాధన కమిటీలో సేవాభావంతో పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కొడిప్యాక సాయిరాం ను జిల్లా అధ్యక్షులుగా పదోన్నతి కల్పిస్తూ సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజు ఉత్తర్వులు జారీ చేశారు. కామారెడ్డి జిల్లా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ బలోపేతం చేయడంతో పాటు వివిధ ప్రాంతాల్లో కమిటీల ఏర్పాటు, సభ్యత్వ విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ సంస్థకు విలువైన సేవలు అందిస్తున్నందుకు ఈ పదోన్నతి కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొడిప్యాక సాయిరాం మాట్లాడుతూ, సేవలను, అంకితభావాన్ని, నిజాయితీని, క్రమశిక్షణను గుర్తించి తనకు జిల్లా అధ్యక్ష పదవిని అప్పగించిన జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజు , రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నా పై నమ్మకం ఉంచి ఈ అవకాశాన్ని కల్పించిన వీరమల్ల రమశ్రీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నా పై అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి, ప్రజల హక్కుల పరిరక్షణకు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కొడిప్యాక సాయిరాం హామీ ఇచ్చారు.



## విద్యార్థి ఉద్యమ నాయకునికి ఘన సన్మానం

**మంథని, జూన్ 02 (వార్త సంధ్య) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నందుకు తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడు బెజ్జంకి దిగంబర్ ను మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఐలి. ప్రసాద్ సన్మానించారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**ఎల్బీనగర్ ప్రతినిధి, జూన్ 2 (వార్త సంధ్య):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు జక్కిడి రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని వీరన్నగుట్టలో నిర్వహించిన వేడుకల్లో ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల చేతుల మీదుగా జాతీయ జెండాతో పాటు



బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేసిందని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ప్రతి తెలంగాణ బిడ్డకు గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, జగదీశ్ యాదవ్, సీనియర్ మహిళా నాయకురాలు సింగిరెడ్డి మల్లీశ్వరి రెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు కోసనం ధనలక్ష్మి వెంకట్ రెడ్డి, చంద్రారెడ్డి, రాంచంద్ర రెడ్డి, కెకెఎల్ గౌడ్, పరమేష్ గౌడ్, అనిల్ కుమార్, బాలరాజ్, రవి, నర్సింహ యాదవ్, నాగార్జున రెడ్డి, పుణ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలే తెలంగాణ రాష్ట్ర నిర్మాణానికి పునాదులు

**- మంథని సహకార సంఘం ఇంచార్జి చైర్మన్ కొత్త శ్రీనివాస్**



**మంథని, జూన్ 02 (వార్త సంధ్య ) :** అమరవీరుల త్యాగాలే తెలంగాణా రాష్ట్ర నిర్మాణానికి పునాధులని మంథని సహకార సంఘం ఇంచార్జి చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. తెలంగాణా అవతరణ దినోత్సవ సందర్భంగా మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో సంఘం పర్సన్ ఇంచార్జి చైర్మన్ కొత్త శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటితో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తయ్యాయని, 2014 జూన్ 2న తెలంగాణ భారతదేశపు 29వ రాష్ట్రంగా అవతరించిందని, ఎన్నో త్యాగాలు, ఉద్యమాలు, ప్రజల ఆకాంక్షల ఫలితంగా ఏర్పడిన ఈ రాష్ట్రం నేడు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. తెలంగాణ ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు, భాష, కళలను ప్రపంచానికి చాటిచెప్పే రాష్ట్రంగా ఎదుగుతోందని, వ్యవసాయం, విద్య, పరిశ్రమలు, ఐటీ, మౌలిక వసతుల రంగాల్లో మరింత పురోగతి సాధిస్తుందని అన్నారు. తెలంగాణ ఆవిర్భావ స్ఫూర్తిని సజీవంగా ఉంచుతూ, సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం లక్ష్యాల సాధనకు ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు ల నాయకత్వంలో ముందుకు సాగాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, టీజీఈఆర్సి సలహాదారు శశిభూషణ్ కాచే, ఆర్టిఐ మెంబర్ మంథని సురేష్, ప్రకాష్ రెడ్డి, డైరెక్టర్లు ఆకుల రాజబాపు, రావికంటి సతీష్ కుమార్, లెక్కల కిషన్ రెడ్డి. కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మి, ఎక్కేటి అనంత రెడ్డి, మాజీ ఎంపిపి కొండ శంకర్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమ సురేష్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పెంటరి రాజు, ఎల్లంకి వంశీధర్, మారుపాక నిహారిక, జంబోజు శ్రీమతి-సమ్మయ్య, లైశెట్టి రజిత, నాయకులు బండ కిషోర్ రెడ్డి, అజీమ్ ఖాన్, గుడిసె గట్టయ్య, కుడుదుల కోటయ్య, రామడుగు మారుతీ, చొప్పకట్ల హనుమంతు, బెజ్జంకి డిగంబర్, గొల్లపల్లి శ్రీనివాస్, గట్టయ్య, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, సంఘ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని చైతన్యపురి డివిజన్ లో డివిజన్ ప్రెసిడెంట్ తోట మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



**ఎల్బీనగర్ ప్రతినిధి, జూన్ 2 (వార్త సంధ్య):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చైతన్యపురి డివిజన్ లో డివిజన్ ప్రెసిడెంట్ తోట మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి పాల్గొని వేడుకల్లో భాగంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి జాతీయ జెండా మరియు దీ=ా పార్టీ జెండా ఎగురవేశారు, ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించి, రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల త్యాగాలను స్మరించుకున్నారు. డివిజన్ ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణ అభివృద్ధి మరింత వేగంగా కొనసాగాలని ఆకాంక్షించారు. జై తెలంగాణ నినాదాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు శుభాకాంక్షలు తెలుపుతూ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమం లో జుఃఇ కౌన్సర్ త్రివేది, ఉద్యమకారుడు కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ చైర్మన్ కోతి నర్సీ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి , శివ ప్రకాష్ మాజీ డివిజన్ ప్రెసిడెంట్ పవన్ కుమార్, రమణారెడ్డి, పనిగిరి కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, నరహరి, గట్టు శ్రీనివాస్,ప్రవీణ్ చారి, సంగీత, సరిత ,అనిత, నాగ లక్ష్మీ,ప్రమీల,వీరన్న యాదవ్, కడియం మోహన్ ,జగన్, శ్రీకాంత్ గౌడ్, వెంకట్ రెడ్డి, జాఫర్జ, శ్రీనివాస్ యాదవ్, ప్రమోద్, అంగత్ గౌడ్, సంతోష్ కుమార్, లక్ష్మణ్, సుధాకర్, ప్రభాకర్ , జగన్, శ్రీధర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎక్లాస్ పూర్ గ్రామ సర్పంచ్ జెండా ఆవిష్కరించారు




**మంథని జూన్ 02(వార్త సంధ్య) :** మంథని మండలం ఎక్లాస్ పూర్ గ్రామ సర్పంచ్ బొడ్డు రజిత శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం జెండా ఆవిష్కరించారు. పంచాయతీ పాలకవర్గం , ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, అన్ని విభాగాల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బందికి ఎంపీడీవో చేతుల మీదగా శానిటేషన్ కిట్లు పంపిణీ చేశారు. అంగన్వాడీ పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. డంపింగ్ యార్డ్ నర్సరీని ఎంపీడీవో మరియు సర్పంచ్ పాలకవర్గ సభ్యులు సందర్శించారు.

## వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం



**మంథని జూన్ 02 (వార్త సంధ్య) :** మంథని మండలం గుంజపడుగు గ్రామంలో సర్పంచ్ దండెవేన సంధ్య బానేష్ అధ్యక్షతన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.అనంతరం స్వచ్ఛ వావ్ సురక్షిత జలవాయు ఎస్ డబ్ల్యు ఎం రూల్స్ 2026 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు సాలిడ్ వ్యర్థాలపై అవగాహన కల్పించారు. వ్యర్థాలను వర్గీకరించే నాలుగు రకాల చెత్త డబ్బాలను బ్లూ బ్లూ, రెడ్, బ్లాక్, గ్రీన్, ప్రజల ముందు వర్గీకరించి వాటిని ఉపయోగించే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించారు. సెగ్రిగేషన్ షెడ్ వద్ద గ్రామంలో నుండి వచ్చే ఆకులు, గడ్డి, వంటి వ్యర్థాల నుండి కంపోస్ట్ ఎరువులను ఎలా తయారు చేయాలో సర్పంచ్ వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు ఎంపీడబ్ల్యు వర్కర్స్ పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ కారుల గుర్తింపుపై ఈనెల 4 న అఖిలపక్ష సమావేశం



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య)జూన్ 2:** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారిని సముచిత రీతిలో గౌరవించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఈనెల 4వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. డా.బీ.ఆర్.అంబెడ్కర్ రాష్ట్ర సచివాలయంలో 6వ అంతస్తులోని రూమ్ నెంబర్ 33 లో 4 వ తేదీ ఉదయం 11.30 గంటలకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరై తమ విలువైన సలహాలు, అభిప్రాయలు తెలిపేందుకు ఒక్కో పార్టీ నుండి ఇద్దరు ప్రతినిధులను నామినేట్ చేయాలని ప్రభుత్వం వివిధ రాజకీయ పార్టీలను కోరింది. ఈ పార్టీల ప్రతినిధులు 4వ తేదీ సమావేశానికి హాజరయ్యేందుకు సచివాలయంలోకి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ప్రవేశించేందుకు వీలుగా ముందస్తుగా తెలంగాణ రాష్ట్ర సచివాలయ చీఫ్ సెక్యూరిటీ అధికారి దేవీదాస్ (87126 66004 ) ను సంప్రదించాలని ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా లోక్ భవన్ లో జాతీయ జెండాను ఆవిష్కరించిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా.




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూన్ 2 :** పాల్గొన్న గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి శ్రీ శశికిరణా చారి, లోక్ భవన్ అధికారులు, ఉద్యోగులు

**రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా స్పీచ్ పాయింట్స్ :**

అమరవీరుల త్యాగాలు, దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటాల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం : గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలకు అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్ "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" స్ఫూర్తితో ముందుకు సాగాలని గవర్నర్ సూచన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వ్యవసాయ వారసత్వం రాష్ట్ర జీవనాడి కాకతీయుల గొలుసుకట్టు చెరువుల నుంచి ఆధునిక ప్రాజెక్టుల వరకు రైతాంగం కృషి ప్రశంసనీయం వ్యవసాయంతో పాటు ఐటీ, ఫార్మా, స్టార్టప్ రంగాల్లో తెలంగాణ అంతర్జాతీయ గుర్తింపు పొందింది రాజ్యాంగ విలువలు, 'సర్వే భవంతు సుఖినః' స్ఫూర్తితో సుసంపన్న తెలంగాణ నిర్మాణం జరగాలి గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం సమపాళ్లలో సాగాలని ఆకాంక్ష దేశ ప్రగతిలో తెలంగాణ మరింత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించిన గవర్నర్

## అమరవీరుల త్యాగాలు, దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటాల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం: గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా










**హైదరాబాద్, జూన్ 2, 2026:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అమరవీరుల త్యాగాలకు, దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటాలకు ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం లోక్‌భవన్‌లో గవర్నర్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఆయన ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ, ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరికీ గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగించారు. ఆధునిక తెలంగాణ నిర్మాణానికి పునాదులు వేసిన ప్రతి ఒక్కరినీ ఈ సందర్భంగా స్మరించుకోవాలని గవర్నర్ పిలుపునిచ్చారు. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అనే సూక్తిని ప్రస్తావిస్తూ, జన్మభూమి స్వర్గం కంటే గొప్పదని పేర్కొన్నారు. తెలంగాణ శతాబ్దాల నాటి సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ వ్యవసాయ వారసత్వం రాష్ట్ర అసలైన జీవనాడిగా నిలిచాయని గవర్నర్ అన్నారు. కాకతీయుల కాలం నాటి గొలుసుకట్టు చెరువుల నుంచి నేటి ఆధునిక సాగునీటి ప్రాజెక్టుల వరకు రైతాంగం చేసిన కృషి తెలంగాణను సస్యశ్యామలం చేసిందని కొనియాడారు. వ్యవసాయ రంగంతో పాటు ఐటీ, ఫార్మా, స్టార్టప్ తదితర రంగాల్లో తెలంగాణ అంతర్జాతీయ గుర్తింపు సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.రాజ్యాంగ విలువలు, 'సర్వే భవంతు సుఖినః' అనే ఆదర్శ స్ఫూర్తితో గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం, నగరాల ఆధునికీకరణ సమపాళ్లలో సాగుతూ సుసంపన్న తెలంగాణ నిర్మాణం జరగాలని గవర్నర్ ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించి దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించాలని గవర్నర్ ఆకాంక్షించారు. వేడుకల్లో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి శ్రీ శశికిరణా చారి, లోక్ భవన్ అధికారులు, ఉద్యోగులు ,సిబ్బంది పాల్గొన్నారు.

## జూన్ 5, 6, 7 తేదీల్లో హైటెక్స్ లో చేనేత వస్త్ర ప్రదర్శన




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 2 :** అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన పోచంపల్లి 'ఇక్కత్' వస్త్ర ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఈనెల 5,6,7 తేదీల్లో ప్రత్యేక వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. పోచంపల్లి చేనేత కళాకారుల జీవన ప్రమాణాల మెరుగుపరిచే లక్ష్యంతో జూన్ 5, 6, 7 తేదీల్లో హైదరాబాద్ హైటెక్స్ లో 'త్రెడ్ పోచంపల్లి' పేరిట వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచేందుకు ఏర్పాటు చేసే ఈ ఎగ్జిబిషన్ లో దాదాపు 100 పైగా స్టాల్స్, మహిళా శక్తి స్వయం సహాయక సంఘాల ద్వారా కూడా స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు.

## సమసమాజ స్థాపనే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం బండి రమేష్



**వార్తా సంధ్య కూకట్పల్లి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమసమాజ స్థాపనే లక్ష్యంగా ముందుకు సాగుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని బోయినపల్లి, బాలానగర్, మూసాపేట, అల్లాపూర్‌లలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ పతాకాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. సకలజనుల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 'దోచుకోవడం దాచుకోవడం' తరహాలో పాలన సాగిందని ఆయన ధ్వజమెత్తారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన అజెండాగా ప్రజాపాలన అందిస్తోందని చెప్పారు.స్వయం సహాయక గ్రూపుల ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో వారికి పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్లు, బస్సుల కేటాయింపులు చేస్తున్నాం. ప్రజా పాలనలో ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మిస్తున్నాం. సన్న బియ్యం పంపిణీ ద్వారా నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నాం.రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు పంటకు బోనస్ కూడా అందజేశాం.విదేశీ పెట్టుబడులు తీసుకురావడం ద్వారా యువతకు పెద్దపీట వేస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం అని తెలిపారు . ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్, డివిజన్ అధ్యక్షులు, మార్కెట్ , టెంపుల్ కమిటీ సభ్యులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యుఐ, మైనారిటీ, ఎస్సీ, బీసీ సెల్స్, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు మరియు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ పోరాటాల్లో కమ్యూనిస్టుల పాత్ర అనన్యం

**అమరవీరుల త్యాగాల పునాదులపైనే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం**

**శేషగిరిభవన్‌లో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు**

**అమరుల ఆశయ సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపు**

**సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 2 (వార్త సంధ్య) :** తెలంగాణ సాయుధ పోరాటం, స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర అనన్యసామాన్యమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్లో సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, తెలంగాణ సాయుధ పోరాటం, స్వరాష్ట్ర సాధన ఉద్యమాల్లో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను నేటి తరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అమరవీరుల త్యాగాల పునాదులపైనే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, మలిదశ తెలంగాణ ఉద్యమంలో కమ్యూనిస్టులు ప్రజల గొంతుకగా నిలిచారని గుర్తుచేశారు. అమరుల ఆశయ సాధన కోసం ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని, ప్రజా సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసమే సిపిఐ నిరంతరం పోరాటాలు సాగిస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, ఎస్కే ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు కొమారి హన్మంతరావు, నేరెళ్ల రమేష్, కె రత్నకుమారి, మునిగడప పద్మ, మునిగడప వెంకటేశ్వర్లు, జక్కుల రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక లారీని ఢీకొట్టిన కారు.. దంపతులు మృతి

**సిద్దిపేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం , కుమారుడు, కోడలు కు తీవ్ర గాయాలు**

**మణుగూరు కు చెందిన కుటుంబం , వరంగల్ వెళ్తున్న క్రమంలో ఈ ఘటన**

**విషాధ ఛాయ ల్లో మణుగూరు ప్రాంతం**







**భద్రాద్రి జిల్లా బ్యూరో, (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషాద ఘటన సిద్దిపేట ప్రాంతంలో చోటుచేసుకుంది. మణుగూరులో రవి గ్రాఫిక్స్ నిర్వహిస్తున్న రవి, ఆయన భార్య సునీత ప్రయాణిస్తున్న కారు ముందుగా వెళ్తున్న ఇసుక లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదం తీవ్రతకు కారు నుజ్జునుజ్జు కాగా, రవి, సునీత అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. కారులో ఉన్న వారి కుమారుడు, కోడలు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న కుమారుడు, కోడలి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మణుగూరులో సుపరిచితులైన రవి, సునీత మృతి వార్త తెలిసి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ ఘటనతో మణుగూరు ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఫ్రెండ్లీ పోలీసింగ్ ఇదేనా..?

**కాలు విరిగినా కేసు లేదు.. బాధితుడి వేదన**

**ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం**

**ప్రమాద బాధితుడికి న్యాయం ఎప్పుడూ..?**

**పోలీసుల తీరుపై ప్రజల్లో ఆగ్రహం**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 02 (వార్త సంధ్య) :** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి కాలు విరిగి తీవ్ర గాయాలు అయినప్పటికీ, బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు కేసు నమోదు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటన గత నెల మే 30న చోటుచేసుకున్నట్లు సమాచారం. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడు చికిత్స పొందుతూ సంబంధిత పోలీస్ స్టేషన్‌లో పిటిషన్ సమర్పించినప్పటికీ, మూడు రోజులు గడిచినా ఎలాంటి కేసు నమోదు చేయలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని పోలీసులు హుటాహుటిన తప్పించారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం "ఫ్రెండ్లీ పోలీసింగ్" పేరుతో ప్రజలకు చేరువ కావాలని చెబుతుండగా, మరోవైపు బాధితుడి ఫిర్యాదుపై స్పందించకుండా ఆలస్యం చేయడం విమర్శలకు దారితీస్తోంది. ప్రమాదంలో కాలు విరిగి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి న్యాయం ఎప్పుడు జరుగుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బాధితుడి ఫిర్యాదుపై వెంటనే విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# అత్యధిక విద్యా ప్రమాణాలతో బోధన

**- తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల్లో ఈర్ల సమ్మయ్య**






**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, జూన్ 02( వార్త సంధ్య,) :** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండల్ ఊషన్నపల్లి ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలలో అత్యధిక విద్యా ప్రమాణాలతో పిల్లలకు విద్యా బోధన చేస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే చదివించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఈర్ల సమ్మయ్య కోరారు. మంగళవారం ఆయన ఊషన్నపల్లి ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో సుశిక్షితులైన, విశేష బోధనానుభవం కలిగిన అధ్యాపకుల చేత ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన ఉచిత బోధనను అందిస్తున్నారన్నారు. ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆంగ్లమాధ్యమ పాఠశాలలో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక లక్షా ఏడు వేలతో స్మార్ట్ టీవి, రూ.7 లక్షలతో సోలార్ విద్యుత్తు ని ఏర్పాటు చేశామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో స్మార్ట్ టీవీతో పిల్లలకు డిజిటల్ తరగతులను నిర్వహిస్తామన్నారు. పాఠశాల పిల్లల సౌకర్యం కోసం దాతల ద్వారా రూ. 1 లక్ష విలువైన మినరల్ వాటర్ ప్లాంట్, ఫ్రిడ్జ్ ఏర్పాటు చేశామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో రూ. 30.25 లక్షల విలువైన అద్భుతమైన నూతన తరగతి గదులను నిర్మించామన్నారు. ఈ సారి పాఠశాలలో కంప్యూటర్ విద్యను ప్రారంభించామని, పిల్లలు స్వయంగా నేర్చుకునే విధంగా పాఠశాలలో తగిన ఏర్పాటు చేశామన్నారు. రూ.1.5 లక్షల విలువతో ప్రీ ప్రైమరీ స్టడీ మెటీరియల్ ఏర్పాటు చేశామన్నారు. రెగ్యులర్ సిలబస్ తో పాటు ప్రాథమిక స్థాయి నుంచి పిల్లలకు నవోదయ, సైనిక్, గురుకుల, ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్షలకు ప్రిపేర్ చేస్తున్నామన్నారు. 2025-26 సంవత్సరంలో గురుకుల, మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో 13 మంది బాలబాలికలు అత్యంత ప్రతిభ కనబరిచి విజయం సాధించారన్నారు. ఇద్దరమ్మాయిలు రాష్ట్రస్థాయి నీతి పద్యాల పోటీల్లో గెలుపొందారున్నారు. ప్రతి రోజు రెండు గంటలు అదనంగా పనిచేస్తూ పిల్లలను అద్భుతంగా తయారు చేస్తున్నామని ఈర్ల సమ్మయ్య తెలిపారు. ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రెండుసార్లు చాంపియన్ స్కూల్ (బెస్ట్ స్కూల్) అవార్డును జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అందుకున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య, వార్డు సభ్యులు ఆవుల సునీత, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్, మంద శ్రీవాణి, గోపిశెట్టి సుప్రియ, బండారి సరిత, పిల్లలు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, పలువురు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం

**కాంగ్రెస్ హామీతో సాకారమైన ఆరు దశాబ్దాల తెలంగాణ కల**

**ప్రజా సంక్షేమ పథకాలతో బంగారు తెలంగాణ దిశగా అడుగులు**

**రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు**

**కొత్తగూడెం ఎంపీ కార్యాలయంలో**

**ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 2 (వార్త సంధ్య) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం ఎంపీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి తోట దేవి ప్రసన్న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వందలాది మంది విద్యార్థులు, యువకుల ఆత్మబలిదానాలు, కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియా గాంధీ ఇచ్చిన హామీ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. ఆరు దశాబ్దాల కలను సాకారం చేసిన అమరుల త్యాగాలను ఎప్పటికీ మర్చిపోరాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తెలంగాణను ప్రజా ప్రభుత్వం బంగారు తెలంగాణగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతున్నామని చెప్పారు. "నీళ్లు -- నిధులు -- నియామకాలు" అనే ఆశయాలతో సాధించుకున్న తెలంగాణలో ప్రతి పౌరుడికి న్యాయం జరగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొంటూ రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు చీకటి కార్తీక్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. ప్రసాద్ బాబు, రాష్ట్ర సీనియర్ నాయకుడు ఆళ్ల మురళి, జిల్లా ఉపాధ్యక్షుడు మంద హనుమంత్, అధికార ప్రతినిధి వై. శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు : జీవీకే మనోహర్

**బీజేపీ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు**

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన బీజేపీ నేతలు**

**తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు పూర్తిగా నెరవేరలేదని విమర్శ**

**రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా**

**అన్ని వర్గాల అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం**

**స్వీట్లు పంపిణీ చేసి రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహణ**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 2 (వార్త సంధ్య) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కొత్తగూడెంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో 12వ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను నిర్వహించారు. కొత్తగూడెం మున్సిపల్ బీజేపీ కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు, సీనియర్ న్యాయవాది, ఉమ్మడి ఖమ్మం జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు జీవీకే మనోహర్ మాట్లాడుతూ, వందలాది మంది విద్యార్థులు, యువకుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. "నీళ్లు, నిధులు, నియామకాలు" అనే లక్ష్యాలతో ఏర్పడిన తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు పూర్తిస్థాయిలో నెరవేరలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు, ప్రస్తుత పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమయ్యారని విమర్శించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని, అభివృద్ధి, పారదర్శక పాలన అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో పాటు మహిళల అభ్యున్నతికి బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్పొరేటర్ అభ్యర్థులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం**

**ఆవిర్భావ సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 2 (వార్త సంధ్య) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రగతి మైదానంలో మంగళవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజులతో కలిసి పాల్గొన్నారు. మంత్రి ముందుగా తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జూలూరుపాడు మండలానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే 478 స్వయం సహాయక సంఘాలకు రూ.51.06 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలకు రూ.59.53 లక్షల ఆర్థిక సహాయం చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే



కళాప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రగతి ప్రదర్శన స్టాళ్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

**అభివృద్ధి, సంక్షేమంపై మంత్రి వివరాలు :**

మంత్రి తుమ్మల తన రాష్ట్ర అవతరణ దినోత్సవ సందేశంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనిస్తోందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' పేరుతో 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోందన్నారు. వ్యవసాయ రంగంలో రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పథకాల ద్వారా రైతులకు భారీ స్థాయిలో ప్రయోజనం చేకూరుతోందని చెప్పారు. సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్ట్, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో సాగునీటి విస్తీర్ణం పెరుగుతుందని తెలిపారు. విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాలల్లో కృత్రిమ మేధ (ఏఐ) బోధన, అల్పాహార పథకం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం, తెలంగాణ డయాగ్నస్టిక్ సేవలు, ఆరోగ్య మహిళా కార్యక్రమాలు, హెచ్‌పీవీ టీకా కార్యక్రమాలను ప్రస్తావించారు. మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా శక్తి, చేయూత పింఛన్లు, గిరిజన, ఎస్సీ, బీసీ, మైనార్టీ సంక్షేమ కార్యక్రమాల ద్వారా లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల నియంత్రణలో కృషి చేస్తున్న పోలీసు యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు.

**కలెక్టర్ జాతీయ పతాక ఆవిష్కరణ :**

అంతకుముందు జిల్లా కలెక్టర్ అంకిత్ ఐడీఓసీ కార్యాలయం, క్యాంపు కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, డీఆర్ఓ పద్మావతి, ఆర్డీవో మధు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
RNI TGTEL/25/A5065



# అర్ధరాత్రి హల్‌చల్ చేసిన యువకులపై కేసులు

**ఐపిఎల్ లో ఆర్సీబీ విజయం సందర్భంగా యువకుల హల్‌చల్**

**త్రిబుల్ రైడింగ్, ప్రమాదకర విన్యాసాలు టపాసులు కాల్చి ప్రజల్లో భయాందోళన**

**ఏడుగురిపై కేసులు నమోదు ఐదు బైక్‌లు సీజ్ చేసిన పోలీసులు**

**సీసీటీవీ ఆధారంగా మరికొందరి గుర్తింపు**



**ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 02 (వార్త సంధ్య) :** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్ ట్రోఫీ గెలుచుకున్న ఆనందంలో ఖమ్మం నగరంలో అర్ధరాత్రి రోడ్లపై హద్దుమీరి ప్రవర్తించిన యువకులపై ఖమ్మం పోలీసులు చర్యలు చేపట్టారు. సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి ఏడుగురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. గత రాత్రి ఖమ్మం జడ్పీ సెంటర్ పరిసరాల్లో కొంతమంది యువకులు మోటార్ సైకిళ్లపై త్రిబుల్ రైడింగ్ చేస్తూ, ప్రమాదకర విన్యాసాలు ప్రదర్శిస్తూ రోడ్లపై చక్కర్లు కొట్టారు. సైలెన్సర్లతో అధిక శబ్దాలు చేస్తూ, టపాసులు కాలుస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన పోలీసులు ఏడుగురిపై కేసులు నమోదు చేసి ఐదు మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా మరికొందరు యువకులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని, వారిపైనా కేసులు నమోదు చేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుట్టినరోజులు, పార్టీల పేరుతో అర్ధరాత్రి వేళల్లో మద్యం సేవించి రోడ్లపై ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు కూడా రాత్రి 10 గంటల తర్వాత పిల్లలకు బైక్‌లు ఇచ్చి బయటకు పంపవద్దని సూచించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే మైనర్‌తో పాటు తండ్రి, వాహన యజమానిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ స్పష్టం చేశారు.

# తెలంగాణ ప్రజలకు కూకట్‌పల్లి పోలీసుల రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు




**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి పోలీసులు రాష్ట్ర ప్రజలందరికీ తమ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాకారం కోసం పోరాడి, ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను ఈ సందర్భంగా కూకట్‌పల్లి పోలీసులు స్మరించుకున్నారు. వారి వీరోచిత త్యాగాలను ఎల్లప్పుడూ గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు.రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ప్రజలందరూ సామరస్యంగా జీవించినప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములవుతూ.. రాష్ట్ర పురోగతికి, సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలి.రాష్ట్ర ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నిండాలని, తెలంగాణ మరింత సంతోషకరంగా, సంపన్నంగా విలసిల్లాలని పోలీసులు ఆకాంక్షించారు.

# అగ్నివీర్ వాయు విభాగానికి ఎంపికైన యువతులు జిల్లాకు గర్వకారణం

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**యువశక్తి ప్రోగ్రామ్ ద్వారా యువతకు ఉజ్వల భవిష్యత్తు**

**మరింత మంది యువతులు సైన్యంలో చేరేందుకు ముందుకు రావాలి**






**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, జూన్-02( వార్త సంధ్య) :** పెద్దపల్లి యువశక్తి ప్రోగ్రామ్‌లో శిక్షణ పొందిన యువతులు సిలివెరి శ్రీజ, చిప్ప శశివర్షిణి భారత సైన్యంలో అగ్నివీర్ వాయు విభాగానికి ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. అగ్నివీర్ వాయు విభాగానికి ఎంపికైన యువతులను సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, దేశ సేవ కోసం భారత సైన్యం, భారత వైమానిక దళంలో చేరడం ఎంతో గౌరవప్రదమైన విషయమని అన్నారు. యువశక్తి ప్రోగ్రామ్‌లో శిక్షణ పొందిన ఇద్దరు యువతులు అగ్నివీర్ వాయు విభాగానికి ఎంపిక కావడం జిల్లా యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా నుంచి మరింత మంది యువత, ముఖ్యంగా యువతులు భారత సైన్యం, వైమానిక దళం, నౌకాదళం వంటి రక్షణ రంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకొని దేశ సేవలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. యువశక్తి ప్రోగ్రామ్ ద్వారా యువతకు అవసరమైన శిక్షణ, మార్గదర్శనం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు సహాయ సహకారాలు అందిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సాధించేందుకు ఈ కార్యక్రమం సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన యువతుల తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ జిల్లా అధికారులకు, యువశక్తి ప్రోగ్రామ్ నిర్వాహకులకు, శిక్షణ అందించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యువశక్తి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ లెంకల మహిపాల్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి సమ్మర్ క్యాంప్ డాన్స్ పోటీల్లో కళాభారతి అకాడమీ ప్రత్యేక ఆకర్షణ






**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 2 ( వార్త సంధ్య ) :** కామారెడ్డి జిల్లా డాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమ్మర్ క్యాంప్ డాన్స్ కాంపిటీషన్‌లో కళాభారతి క్లాసికల్ డాన్స్ అకాడమీ గురువు శైలజ తమదైన ప్రత్యేక శైలితో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.డాన్స్ అనేది కేవలం పిల్లలకు మాత్రమే పరిమితం కాదని చాటిచెప్పుతూ, పిల్లలతో పాటు తల్లిదండ్రులను కూడా వేదికపై నృత్య ప్రదర్శనల్లో భాగస్వాములను చేశారు. పిల్లలకు వెస్ట్రన్ డాన్స్‌తో పాటు క్లాసికల్ డాన్స్‌లోనూ శిక్షణ అందించి ప్రతిభను వెలికితీశారు. అదేవిధంగా, తన తోటి గురువు ప్రవీణ్ కలిసి అద్భుతమైన క్లాసికల్ డాన్స్ ప్రదర్శించి సభికుల ప్రశంసలు అందుకున్నారు. ఈ ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శైలజ వద్ద డాన్స్ నేర్చుకోవడం ఎంతో ఆనందంగా ఉందని రాజంపేట గ్రామానికి చెందిన కేజీబీవీ విద్యార్థిని చిన్నారి ఎస్. సాహితి, ఆమె తల్లి శ్వేత తెలిపారు. పిల్లలకు, తల్లిదండ్రులకు నాణ్యమైన నృత్య శిక్షణ అందిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్న శైలజ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రోత్సాహం అందించిన మెడికేర్ హాస్పిటల్, విశాల షాపింగ్ మాల్, మీనాక్షి స్పోర్ట్స్ సంస్థల దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి డాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్రి, కళాభారతి డాన్స్ అకాడమీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

రాజంపేట కేజీబీవీ విద్యార్థిని ఎస్. సాహితి

# సంక్షేమం - అభివృద్ధి- సామాజిక న్యాయం లక్ష్యంగా ప్ర భుత్వ పరిపాలన

**ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు**

**జూన్ 2 నుంచి కోటి 15 లక్షల కుటుంబాలకు రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా**

**ప్రాథమిక పాఠశాల నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు నూతనంగా బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రారంభం**

**1,54,598 మంది రైతులకు రూ.114 కోట్ల 4 లక్షల రైతు భరోసా నిధులు జమ**

**రూ.767 కోట్ల విలువైన 3,23,773 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు**

**1,39,760 కుటుంబాలకు గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్**

**ఉచిత బస్సు ప్రయాణంతో జిల్లా మహిళలకు 193 కోట్లు ఆదా**

**మహిళా సంఘాలకు రూ.507 కోట్లకు పైగా బ్యాంక్ లింకేజ్ రుణాలు**

**74,157 వ్యవసాయ కనెక్షన్లకు 382 కోట్ల 65 లక్షల సబ్సిడీతో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్**

**రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా 14,983 మందికి ఉచిత శస్త్ర చికిత్సలు**

**451 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు 126 కోట్ల రూపాయలు విడుదల**

**93 వేల 659 మంది లబ్ధిదారులకు 252.22 కోట్ల చేయూత పెన్షన్ పంపిణీ**

**తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్**






**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,జూన్ 02( వార్త సంధ్య ) :** సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పెద్దపల్లి పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వేడుకల్లో ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉదయం పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఆయన అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు కవాతు నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.ఎఈ సందర్భంగా ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉన్న తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు, 2047 నాటికి మూడు ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున జీవిత బీమా రక్షణ కల్పించే "ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా" పథకాన్ని జూన్ 2 నుంచి అమలు చేస్తున్నామని తెలిపారు. కుటుంబ పోషకుడు మరణించిన సందర్భంలో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు పరిశుభ్రత, ఆరోగ్యం, విద్య, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువజనాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యారంగంలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు నూతనంగా అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించామని చెప్పారు. జిల్లాలోని 547 పాఠశాలల ద్వారా సుమారు 37 వేల మంది విద్యార్థులకు విద్య అందుతోందని, ఎఫ్.ఆర్.ఎస్ విధానంలో 96 శాతం హాజరు నమోదవుతోందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రూ.17 కోట్లతో మౌలిక వసతులు కల్పించామని, రూ.66 లక్షలతో భవిత కేంద్రాలను అభివృద్ధి చేశామని, పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన 16 పాఠశాలలను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. అభయహస్తం కార్యక్రమం కింద జిల్లాలో 9,823 కొత్త తెల్ల రేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు 8,978 మంది కొత్త సభ్యులను పాత కార్డుల్లో చేర్చామని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో 1,18,953 మంది లబ్ధిదారులకు 4,73,691 గ్యాస్ సిలిండర్లను రూ.14.03 కోట్ల సబ్సిడీతో రూ.500కే అందించామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా జిల్లాలో మహిళలు రూ.193.35 కోట్ల మేర ఆదా చేసుకున్నారని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో జిల్లాకు మంజూరైన 6,451 ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని, లబ్ధిదారుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.126 కోట్లు జమ చేశామని తెలిపారు. రెండో విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2 వేల చొప్పున మొత్తం 6 వేల ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్న 1,39,760 కుటుంబాలకు రూ.135.92 కోట్ల సబ్సిడీతో ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. మహిళా శక్తి మిషన్ కింద జిల్లాలోని 6,851 స్వయం సహాయక సంఘాలకు రూ.454.66 కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు, 1,642 సంఘాలకు రూ.52.90 కోట్ల స్త్రీనిధి రుణాలు అందించామని చెప్పారు. 8,909 సంఘాలకు రూ.18.03 కోట్ల వడ్డీ రాయితీ విడుదల చేశామని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా 15 అద్దె ఆర్టీసీ బస్సులు, ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్, ఒక పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో 5,668 మహిళా ఎంటర్‌ప్రైజ్‌లు స్థాపించబడ్డాయని పేర్కొన్నారు. రంగంపల్లి వీ-హబ్ కేంద్రం ద్వారా 376 మందికి శిక్షణ అందించామని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 93,659 మంది లబ్ధిదారులకు రూ.252.22 కోట్ల చేయూత పింఛన్లు అందించామని తెలిపారు. నరేగా కింద రూ.18.21 కోట్ల వ్యయంతో 30,659 కుటుంబాలకు ఉపాధి కల్పించామని చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద 456 మంది రైతులకు రూ.1.92 కోట్ల సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశామని తెలిపారు. రైతు భరోసా కింద 1,54,598 మంది రైతులకు రూ.114.04 కోట్ల నిధులు జమ చేశామని చెప్పారు. 50 శాతం సబ్సిడీపై 6,900 క్వింటాళ్ల పచ్చిరొట్టె విత్తనాలు పంపిణీ చేశామని తెలిపారు. రైతు బీమా కింద గత రెండు సంవత్సరాల్లో మరణించిన 1,002 మంది రైతు కుటుంబాలకు రూ.44.85 కోట్ల పరిహారం అందించామని పేర్కొన్నారు. 2025-26 యాసంగి సీజన్‌లో 334 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రూ.767.09 కోట్ల విలువైన 3,23,773 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధరను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఉద్యానవన శాఖ ద్వారా 3,472 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ చేపట్టి రూ.1.78 కోట్ల సబ్సిడీ అందించామని, సూక్ష్మ నీటి సేద్య పథకం కింద 1,162 ఎకరాలకు రూ.3.19 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు.విద్యుత్ శాఖ ద్వారా జిల్లాలోని 74,157 వ్యవసాయ కనెక్షన్లకు రూ.382.65 కోట్ల సబ్సిడీతో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. పీఎం కుసుమ్ పథకం కింద 9.5 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకం కింద 1,094 సోలార్ రూఫ్‌టాప్‌లను 7.287 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో 9 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నందిమేడారం గ్రామాన్ని మోడల్ సోలార్ గ్రామంగా అభివృద్ధి చేస్తూ రూ.51.28 కోట్లతో 1,486 గృహాలు, 628 వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జిల్లాలో రూ.39 కోట్ల 11 లక్షల వ్యయంతో 14,983 మందికి ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించగా, తెలంగాణ హబ్ డయాగ్నోస్టిక్స్ ద్వారా 95,624 మంది నుంచి 1,72,159 శాంపిల్స్ సేకరించి 3,39,906 పరీక్షలు ఉచితంగా నిర్వహించామని, 108 అంబులెన్స్ ద్వారా 13,937 మందికి, 102 సేవల ద్వారా 16,924 మంది గర్భిణులు, చిన్నారులకు రవాణా సౌకర్యం కల్పించారు. రామగుండం క్రిటికల్ కేర్ భవనం, మేడారం సీహెచ్‌సీ లను ప్రారంభించగా, రూ.51 కోట్లతో జిల్లా ఆసుపత్రి, రూ.26 కోట్లతో నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రోడ్లు, భవనాల అభివృద్ధికి ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు కేటాయించిందని, జిల్లాలో 102.06 కిలో మీటర్ల మేర 22 డబుల్ రోడ్డు విస్తరణకు రూ.921.93 కోట్లు మంజూరు చేయగా పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. రూ.497.03 కోట్లతో 17 వంతెనల నిర్మాణం, విస్తరణ పనులు చేపట్టగా 9 పూర్తయ్యాయని, వరదలతో దెబ్బతిన్న రహదారులను రూ.31.81 కోట్లతో పునరుద్ధరణ పనులు చేపట్టి 16 పనులు పూర్తి చేశామని అన్నారు. పెద్దపల్లి--కాల్వ శ్రీరాంపూర్ మార్గంలో రూ.119 కోట్లతో నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు 75 శాతం పూర్తయ్యాయని, అలాగే రూ.160.30 కోట్లతో రామగుండం ఆసుపత్రి భవనం, రూ.104.81 కోట్లతో కోర్టు, ఇతర భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు పట్టణాభివృద్ధి రంగంలో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా మౌలిక సదుపాయాల విస్తరణ చేపడుతోందని, లిఅమృత్-2.0 పథకం కింద జిల్లాలో రూ.289.46 కోట్లతో ఎస్టీపీలు, సీవర్ ట్రంక్ మెయిన్‌ల, యూఐడీఎఫ్ నిధుల ద్వారా రూ.226 కోట్లతో మంచినీటి సరఫరా, రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. డీఎంఎఫ్‌టీ నిధులు రూ.67.59 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, భూగర్భ మురుగు కాలువలు, మంచినీటి పైప్‌లైన్ పనులు అమలులో ఉన్నాయి. మెప్మా ఆధ్వర్యంలో 714 సంఘాలకు రూ.96.52 కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు, 34,707 మంది వీధి వ్యాపారులకు రూ.68.32 కోట్ల పీఎం స్వనిధి రుణాలు, 994 సంఘాలకు రూ.21.11 కోట్ల స్త్రీనిధి ఆర్థిక సహాయం అందించామని అన్నారు. మత్స్య శాఖ ద్వారా 26,051 హెక్టార్లలో కోటి 58 లక్షల చేప పిల్లల విడుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రమాదాల్లో మరణించిన 23 మత్స్యకార కుటుంబాలకు రూ.1.15 కోట్ల పరిహారం అందించామని చెప్పారు.

మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా 706 అంగన్‌వాడీ కేంద్రాల్లో 3,710 మంది గర్భిణీలు, 2,930 మంది బాలింతలు, 33,441 మంది చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. 153 మంది దివ్యాంగులకు పరికరాలు, 21 మందికి స్వయం ఉపాధి రుణాలు, 9 దివ్యాంగ జంటలకు వివాహ ప్రోత్సాహకాలు అందించామని పేర్కొన్నారు. యువజన, క్రీడా రంగంలో రూ.2.50 కోట్లతో ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు, రూ.1.50 కోట్లతో స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.పారిశ్రామిక రంగంలో 266 మందికి ఉపాధి కల్పించే 22 పరిశ్రమలకు రూ.11.24 కోట్ల పెట్టుబడులతో టీజీ-ఐపాస్ అనుమతులు మంజూరు చేశామని, పీఎంఈజీపీ కింద 29 యూనిట్లు, టీ-ఐడియా, టీ-ప్రైడ్ ద్వారా 42 పరిశ్రమలకు రూ.7.67 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ఉపాధి కల్పనలో భాగంగా నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 3,515 మంది యువత పాల్గొనగా 933 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని తెలిపారు. అగ్నివీర్ శిక్షణ ద్వారా 47 మంది ఎంపికైనట్లు చెప్పారు. అనంతరం సమీకృత కలెక్టరేట్ ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణరావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి పూలమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ, డిసిపి రాంరెడ్డి, డిఆర్ఓ రాజేశ్వరి, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, నూగిళ్ల మల్లయ్య ,ఆర్డీఓ బి. గంగయ్య, కలెక్టరేట్ ఏఓ ప్రకాష్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి పాల్కురికి సోమన్న మూల వేదికపై నిర్వహిస్తున్న...













**ప్రతిష్టాత్మకమైన "తెలంగాణ ప్రజాకళ" 99 రోజుల సాంస్కృతిక మహోత్సవంలో... తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు - కవిసమ్మేళనం**

హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ :2

కవి సమ్మేళనం పాల్గొన్న కవులు ...

నిర్వాహకులు: రాయరావు సూర్య ప్రకాష్ రావు

వెన్నెల సత్యం
అంకం మనోహర్
సరికొండ నరసింహ రాజు

కాసుల లింగారెడ్డి
కాంచనపల్లి రాజేందర్ రాజు

ఇంద్రావత్ రాహుల్ నాయక్
మహ్మద్ హస్సేన
కటుకోజ్వల రమేష్
పొన్నం రాజయ్య

సి.హెచ్. ఆంజనేయులు
ముదిగొండ సంతోష్
నాగవర్మ ముత్యం

నాగిళ్ళ రమేష్
సుంకర రమేష్
వి.పి. చందన్ రావు
వేణుశ్రీ సుదర్శనం

నర్రా ప్రవీణ్ రెడ్డి
బూర్గు గోపికృష్ణ
సందీప్ ఒటారికారి
అనుముల ప్రభాకరచారి
వడిచెర్ల సత్యం
స్వప్న కొండమడుగు

ఈ ప్రతిభావంతులైన కవులను భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నర్సింహా రెడ్డి ఐఏఎస్ గారు సత్కరించారు.ఈ కార్యక్రమానికి భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ సాంస్కృతిక శాఖ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ కుమార్ సూపరింటెండెంట్ లిప్రసాద్ బాబు సాంస్కృతిక శాఖ సలహాదారులు ముచర్ల దినకర్ పల్లె నర్సింహా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తెలంగాణ అవతరణ పాటలతో లఅలరించారు.

## కొత్తగూడెం ఆర్‌సీహెచ్‌పీలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఉత్తమ కార్మికుడిగా ఎంవీ డ్రైవర్ మురళికి సన్మానం**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 02 (వార్త సంధ్య) :** కొత్తగూడెం ఏరియా ఆర్‌సీహెచ్‌పీలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరులను స్మరించుకుంటూ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి గట్టయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ చరిత్ర, అమరవీరుల త్యాగాలు, రాష్ట్ర సాధనలో వారి విశిష్ట పాత్రను వివరించారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఆర్‌సీహెచ్‌పీ కార్మికులు తెలంగాణ అమరవీరులకు సంతాపం తెలియజేశారు. తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌సీహెచ్‌పీలో విధులు నిర్వహిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు కార్మికులను గుర్తింపు సంఘం, ఏఐటీయూసీ యూనియన్ నాయకులు మరియు అధికారులు సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్‌సీహెచ్‌పీలో ఎంవీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న మురళిని కొత్తగూడెం ఏరియా ఉత్తమ కార్మికుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా యాజమాన్యం, అధికారులు, ఏఐటీయూసీ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు. మురళి అందించిన సేవలను కొనియాడుతూ అధికారులు, కార్మిక నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు, అధికారులు, యూనియన్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో భజన కార్యక్రమం

**- ప్రముఖ క్రికెట్ కామెంటేటర్ మహావాది సుధీర్ తో ప్రత్యేక కార్యక్రమం**





**మంథని, జూన్ 02(వార్త సంధ్య) :** మంథని పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో అధిక జేష్ఠ మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ క్రికెట్ కామెంటేటర్ మహావాది సుధీర్ ఆలపించిన పాటలు భక్తులను అలరింపజేశాయి. సాయంత్రం 6 గంటల నుండి ఏడున్నర గంటల వరకు నిర్వహించిన ఈ భజన కార్యక్రమంలో "మాతో హే మా మాతోహే మా మా జేసే దునియా మే హై కోయి కహా " , దేకో హో దివానో తుమ్హే కామ్ నా కరో రామ్ క నామ్ బదనామ్ నా కరో లాంటి హిందీ భక్తి గీతాలు భక్తులను మంత్రముగ్ధులను చేసింది. అధిక జేష్ఠ మాసమును పురస్కరించుకొని ఏర్పాటుచేసిన ఈ భజన కార్యక్రమంలో మహవాది సుదీర్ పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని ఆలయ అర్చకులు రామడుగు సాయి శ్రీనివాస్ తెలిపారు. భజన కార్యక్రమం అనంతరం సాయిబాబాకు శేజా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భజనపరులు అవధానుల శ్రీనివాస్, యజ్ఞంభట్ల లక్ష్మీరాజ్యం, తల్లం శ్రీనివాస్ తో పాటు పలువురు భజన పరులు పాల్గొన్నారు.

# కొత్త ట్యాక్స్ స్లాబ్స్ ఇవే!

## మీ జీతంపై ఎంత పన్ను పడుతుందో తెలుసుకోండి!

ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఉద్యోగులను వేధించే అతిపెద్ద ప్రశ్న.. "పాత పన్ను విధానం బాగుంటుందా లేక కొత్త పన్ను విధానం ఎంచుకోవాలా". 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొన్ని కీలక మార్పులు చేసింది. ఈ నేపథ్యంలో, మీ ఆదాయంపై తక్కువ పన్ను పడాలంటే మీరు ఏ మార్గాన్ని ఎంచుకోవాలో నిర్ణయించుకోవడానికి సరైన ఇన్ కమ్ ట్యాక్స్ కాలిక్యులేటర్ అవసరం. ఈ కథనంలో ఆ రెండింటి మధ్య ఉన్న వ్యత్యాసాలను సులభంగా అర్థం చేసుకుందాం.2026 పన్ను నిబంధనల్లో కొత్త మార్పులేంటి?ఏప్రిల్ 1, 2026 నుండి అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనల ప్రకారం, జీతాలు తీసుకునే ఉద్యోగులకు కొన్ని అదనపు ప్రయోజనాలు లభించాయి.హెచ్ఆర్ఏ : మరిన్ని నగరాల్లో ఇంటి అద్దె భత్యంపై పన్ను మినహాయింపు పరిమితిని పెంచారు.మీల్ కార్డులు: సోడెక్సో వంటి మీల్ కార్డులపై ఇచ్చే పన్ను ప్రయోజనాలు పెరిగాయి.స్టాండర్డ్ డిడక్షన్: కొత్త పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50,000 నుండి రూ.75,000కు పెంచడం ఒక పెద్ద ఊరట.పాత పన్ను విధానం : పెట్టుబడులే కీలకంమీరు ఎల్ఐసీ , పీపీఎఫ్ , ఈఎల్ఎస్ఎస్ వంటి పథకాల్లో భారీగా పెట్టుబడులు పెడుతుంటే పాత విధానమే మీకు మేలు చేస్తుంది.




ఇందులో సెక్షన్ 80జ కింద రూ.1.5 లక్షల వరకు, అలాగే మెడికల్ ఇన్సూరెన్స్ (80), హోమ్ లోన్ వడ్డీ, హెచ్ఆర్ఏ వంటి అనేక మినహాయింపులు పొందవచ్చు. మీ పెట్టుబడులు , మినహాయింపులు రూ.3 లక్షలు దాటితేనే ఈ విధానం లాభదాయకంగా ఉంటుంది.కొత్త పన్ను విధానం సరళం , తక్కువ రేట్లుఎలాంటి పెట్టుబడులు లేని వారికి, పన్ను ఫైలింగ్ తలనొప్పి వద్దు అనుకునే వారికి కొత్త విధానం బెస్ట్. ఇందులో పన్ను రేట్లు చాలా తక్కువగా ఉంటాయి. కొత్త ట్యాక్స్ స్లాబ్స్ (2026) ప్రకారం..రూ.4 లక్షల వరకు.. పన్ను లేదురూ.4-రూ.8.. 5%రూ.8-రూ.12.. 10%రూ.12-రూ.16రూ..15%రూ.16-రూ.20రూ.. 20%రూ.20రూ-రూ.24.. 25%రూ.24 లక్షల పైన.. 30% రిబేట్ ప్రయోజనాల వల్ల రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్నవారు కొత్త విధానంలో అసలు పన్ను కట్టాల్సిన పని లేదు.ఏ జీతానికి ఏది బెస్ట్రూ.15 లక్షల ఆదాయం: సాధారణంగా కొత్త విధానంలోనే పన్ను తక్కువ పడుతుంది. మీరు రూ.3 లక్షల పైన డిడక్షన్స్ చూపిస్తేనే పాతది మేలు.రూ.30 లక్షల ఆదాయం: ఇక్కడ మీ సేవింగ్స్ అలవాట్లపై ఆధారపడి ఉంటుంది. పాత విధానంలో గరిష్ట మినహాయింపులు పొందితే పన్ను ఆదా చేయవచ్చు, లేదంటే కొత్తదే సులభం.రూ.50 లక్షల పైన: అధిక ఆదాయం ఉన్నవారికి కొత్త విధానంలో సర్‌చార్జ్ తక్కువగా ఉండటం ఒక అడ్వాంటేజ్.చివరగా చెప్పాలంటే అందరికీ ఒకే విధానం సరిపోదు. మీ దగ్గర హోమ్ లోన్ ఉండి, ఇన్సూరెన్స్ , ఇతర సేవింగ్స్ ఎక్కువగా ఉంటే పాత విధానం వైపు మొగ్గు చూపండి. ఏ టెన్షన్ లేకుండా ఎక్కువ జీతం చేతికి రావాలి అనుకుంటే కొత్త విధానం ఎంచుకోండి. పన్ను ఫైల్ చేసే ముందు ఖచ్చితంగా ఆన్‌లైన్ ఇన్ కమ్ ట్యాక్స్ కాలిక్యులేటర్ ఉపయోగించి రెండు పద్ధతుల్లో పన్నును లెక్కించుకుని, మీకు ఏది తక్కువగా ఉంటే దాన్నే ఫైనల్ చేయండి. సరైన ప్లానింగ్ ఉంటేనే మీ కష్టార్జితాన్ని పన్ను రూపంలో వృథా కాకుండా కాపాడుకోగలరు.

# ఒరాకిల్‌లో ఉద్యోగం పోయింది కానీ దర్జాగా బతుకుతున్నాడు!

## ఈ టెక్కీ ప్లానింగ్ మామూలుగా లేదుగా!

సాఫ్ట్‌వేర్ రంగంలో లక్షల్లో జీతాలు ఉన్నా ఎప్పుడు ఏ ఉద్యోగం ఊడుతుందో తెలియని పరిస్థితి. ఇటీవల అమెజాన్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థలే వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగించాయి. తాజాగా ప్రపంచ ప్రఖ్యాత టెక్ సంస్థ ఒరాకిల్ దాదాపు 30,000 మందిని ఇంటికి పంపించేసింది. ఇందులో మన భారతీయులే 12,000 మంది ఉండటం గమనార్హం. తెల్లవారుజామున 6 గంటలకు మెయిల్ చూస్తే.. "ఈరోజే మీకు ఆఖరి రోజు" అని ఉండటం ఎవరికైనా గుండె ఆగినంత పనే. కానీ, బెంగళూరు లో పనిచేసే ఒక ఒరాకిల్ ఉద్యోగి మాత్రం ఈ విషాదాన్ని ఎంతో ధైర్యంగా ఎదుర్కొన్నాడు. అతని కథ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.భయం లేదు.. బాధ లేదు.. అంతా ప్లానింగ్!నాయక్ సత్య అనే వ్యక్తి తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో తన స్నేహితుడి కథను పంచుకున్నారు. అతని స్నేహితుడు బెంగళూరులో ఒరాకిల్ సంస్థలో పనిచేసేవాడు. లేఆఫ్స్‌లో భాగంగా అతనికి కూడా పింక్ స్లిప్ అందింది. సాధారణంగా ఇలాంటి సమయంలో ఎవరైనా డిప్రెషన్‌లోకి వెళ్తారు లేదా సోషల్ మీడియాలో తమ బాధను వెళ్లగక్కుతారు. కానీ, ఇతను మాత్రం ప్రశాంతంగా తన సామాన్లు సర్దుకుని సొంతూరు భువనేశ్వర్‌కు బయలుదేరాడు. దానికి కారణం అతను ముందుగానే చేసుకున్న పక్కా ఫైనాన్షియల్ ప్లానింగ్.ఫిక్స్‌డ్ డిపాజిట్లే అండగా నిలిచాయిచాలామంది ఐటీ ఉద్యోగులు ఇన్ ఫ్లుయెన్సర్ల మాటలు విని స్టాక్ మార్కెట్లు, ఎస్ఐపీ ల వెంట పడుతుంటారు. కానీ, ఇతను మాత్రం పాత కాలపు పద్ధతిలో ఫిక్స్‌డ్ డిపాజిట్లనే నమ్ముకున్నాడు. తన తల్లిదండ్రులు, భార్య, బిడ్డ పేర్ల మీద తలా రూ. 15 లక్షలు ఎఫ్‌డీ చేశాడు. తన సొంత పేరు మీద మరో రూ. 30 లక్షలు డిపాజిట్ చేశాడు. ఈ మొత్తానికి వడ్డీ రూపంలోనే అతనికి నెలకు రూ. 45,000 వస్తోంది. అంటే ఉద్యోగం లేకపోయినా ఇల్లు గడవడానికి అతనికి ఎలాంటి ఇబ్బందీ లేదు. ఉచ్చులో పడలేదుబెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రాగానే చాలామంది చేసే తప్పు.. హోమ్ లోన్ తీసుకుని కోట్లు పెట్టి ఇల్లు కొనడం. కానీ, ఇతను ఆ పని చేయలేదు. బెంగళూరు లో అనవసరంగా అప్పులు చేసి ఆస్తులు కొనకపోవడం వల్ల అతనికి ఇప్పుడు ఈఎంఐలు కట్టాల్సిన టెన్షన్ లేదు. ప్రస్తుతం తన సొంత ఊరిలో ఖాళీగా ఉండకుండా అతనే కారు నడుపుతూ ఊబర్ డ్రైవర్‌గా మారాడు. డ్రైవింగ్



ద్వారా వచ్చే ఆదాయం, బ్యాంకు వడ్డీలు కలిపి అతను ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఉన్నప్పటి కంటే ఎక్కువ ప్రశాంతంగా ఉన్నాడు.మనం నేర్చుకోవాల్సిన పాఠం ఏంటిప్రైవేట్ కంపెనీల్లో చేతి నిండా జీతం వస్తున్నప్పుడు విచ్చలవిడిగా ఖర్చు చేయకుండా, భవిష్యత్తు కోసం కొంత మొత్తాన్ని పొదుపు చేయాలి. ముఖ్యంగా స్థిరమైన ఆదాయం ఇచ్చే పథకాల్లో పెట్టుబడి పెట్టడం వల్ల ఇలాంటి కష్టకాలంలో ఎవరిపైనా ఆధారపడకుండా ఉండొచ్చు. క్రమశిక్షణతో కూడిన పెట్టుబడి, అనవసరమైన అప్పులు చేయకపోవడమే ఈ ఐటీ ఉద్యోగి నేర్పిన గొప్ప పాఠం.మొత్తంగా చెప్పాలంటే, ఉద్యోగం అనేది జీవితంలో ఒక భాగం మాత్రమే. అదే జీవితం కాదు. బెంగళూరు లోని ఈ ఐటీ ఉద్యోగి లాగా మనం కూడా ఆర్థికంగా బలంగా ఉంటే.. ఎలాంటి సవాళ్లనైనా నవ్వుతూ ఎదుర్కోవచ్చు. మీరు ఎంత సంపాదిస్తున్నారు అన్నది కాదు, ఎంత పొదుపు చేస్తున్నారు అన్నదే మీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

# 45 లీటర్ల ట్యాంక్‌కు 52 లీటర్ల పెట్రోల్ బిల్లు

## పెట్రోల్ బంక్ స్కామ్‌తో షాకైన యజమాని

అసలు నిజం ఏమిటంటే.. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జరిగిన ఈ సంఘటన వినియోగదారుల హక్కులకు సంబంధించిన ఒక తీవ్రమైన మోసాన్ని వెలుగులోకి తెచ్చింది. వాహన తయారీ సంస్థ అధికారికంగా ధృవీకరించిన 45 లీటర్ల గరిష్ట సామర్థ్యం ఉన్న సరికొత్త వోక్స్‌వ్యాగన్ వర్టస్ కారులో ఏకంగా 52 లీటర్ల ఇంధనం పట్టిందని బిల్లు ఇవ్వడం భౌతిక నియమాలకు పూర్తిగా విరుద్ధం. కారు యజమాని చరణ్ సింగ్ ఈ అసాధ్యమైన రీడింగ్‌ను గమనించి వెంటనే స్పందించడం, కంపెనీ ప్రతినిధిని పిలిపించి సాంకేతిక ఆధారాలతో నిలదీయడం ఈ కేసులో కీలకమైన మలుపుగా మారింది. పెట్రోల్ పంప్ సిబ్బంది ఇంధనాన్ని రెండు విడతలుగా నింపే ప్రక్రియను ఎంచుకోవడం వెనుక డిస్పెన్సింగ్ మిషన్ సాఫ్ట్‌వేర్‌ను లేదా రీడింగ్‌ను తారుమారు చేసే (చిప్ ట్యాంపరింగ్) వ్యూహం దాగి ఉండే అవకాశం ఉంది. స్థానిక తూనికలు, కొలతల అధికారుల కుమ్మక్కుతోనే ఈ తరహా వ్యవస్థీకృత దోపిడీ సాగుతోందని బాధితుడు చేసిన ఆరోపణ తీవ్రమైనది, అందుకే జిల్లా యంత్రాంగం రంగంలోకి దిగి తక్షణ విచారణకు ఆదేశించింది. ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండటానికి వాహనదారులు ఎల్లప్పుడూ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలి. పెట్రోల్ బంక్‌కు వెళ్లినప్పుడు కేవలం మీటర్ '0' (జీరో) దగ్గర ప్రారంభమైందా లేదా అనేది మాత్రమే కాకుండా, ఇంధనం లీటరు ధర మరియు డెన్సిటీ రీడింగ్‌లు కూడా సరిగ్గా ఉన్నాయో లేదో గమనించాలి. ఇంధనాన్ని రెండు విడతలుగా నింపుతామని అటెండెంట్లు చెబితే దానికి అస్సలు అంగీకరించకూడదు. ఒకవేళ మధ్యలో ప్రక్రియ ఆగిపోతే, మీటరును మళ్లీ మొదటి నుండి అంటే సున్నా నుంచే ప్రారంభించమని పట్టుబట్టాలి. పొట్టి కారే కానీ చాలా గట్టిదండి బాబూ.. లైట్ తీసుకున్న వాళ్లే ఇప్పుడు ఎగబడి కొంటున్నారు అలాగే, సాధారణంగా మోసపూరిత సాఫ్ట్‌వేర్ సెట్టింగులు రూ.500, రూ. 1000, రూ. 2000 వంటి రౌండ్ ఫిగర్ మొత్తాలకు అనుగుణంగా ట్యాంపర్ అయ్యే అవకాశం ఎక్కువ కాబట్టి, ఎల్లప్పుడూ రూ.510, రూ.1030 వంటి భిన్నమైన మొత్తాలకు లేదా లీటర్ల లెక్కన ఇంధనాన్ని నింపడం సురక్షితం. ఒకవేళ ఇంధన పరిమాణంపై ఏదైనా బలమైన అనుమానమైతే వస్తే, ప్రతి పెట్రోల్ బంక్‌లోనూ అందుబాటులో ఉండే ప్రభుత్వ గుర్తింపు పొందిన 5-లీటర్ల కోనికల్ జార్ (కొల పాత్ర) ద్వారా ఇంధనాన్ని కొలిపించి తనిఖీ చేసే చట్టపరమైన హక్కు వినియోగదారునికి ఉంది. చరణ్ సింగ్ లాగా ధైర్యంగా ప్రశ్నించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పుడే ఇలాంటి లీటర్ల దోపిడీకి అడ్డుకట్ట పడుతుంది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ



విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# పాకిస్తాన్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి



## రాజనాథ్ సింగ్ మాస్ వార్నింగ్..ఎందుకంటే..

భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్థాన్‌కు అత్యంత కఠినమైన హెచ్చరిక జారీ చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. పాకిస్థాన్ గనుక పశ్చిమ బెంగాల్ వైపు కన్నెత్తి చూసినా లేదా భారతదేశ ప్రాదేశిక సమగ్రతకు భంగం కలిగించాలని ప్రయత్నించినా, ఆ దేశం మరిన్ని ముక్కలుగా విడిపోయే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. 1971 యుద్ధంలో పాకిస్థాన్ విడిపోయి బంగ్లాదేశ్ ఏర్పడిన చారిత్రక ఉదాహరణను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.రాజ్‌నాథ్ సింగ్ తన ప్రసంగంలో ప్రధానంగా పాకిస్థాన్ ఉగ్రవాద విధానాలను తప్పుబట్టారు. భారతదేశం ఎప్పుడూ పొరుగు దేశాలతో శాంతిని కోరుకుంటుందని, అయితే మన దేశ భద్రతకు ముప్పు వాటిల్లితే మాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. గతంలో పాకిస్థాన్ ఒకసారి విభజనకు గురైంది, ఒకవేళ వారు తమ పద్ధతి మార్చుకోకుండా బెంగాల్‌ను లేదా భారతదేశంలోని ఇతర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటే.. వారు మళ్లీ అంతర్గత విభజనలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఇది కేవలం మాటలు మాత్రమే కాదని, భారత సైన్యం ఎలాంటి సవాలునైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందనే సంకేతాన్ని ఆయన పంపారు.ఈ సందర్భంగా ఆయన పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా విమర్శలు గుప్పించారు. సరిహద్దు రాష్ట్రమైన బెంగాల్‌లో చొరబాట్లు, జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని ఆయన ఆరోపించారు. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం దేశ సరిహద్దులను పటిష్టం చేసిందని, ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనైనా అణచివేయడానికి కట్టుబడి ఉందని రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ గురించి కూడా ఆయన ప్రస్తావిస్తూ.. అది ఎప్పటికీ భారతదేశంలో అంతర్భాగమేనని, అక్కడి ప్రజలే త్వరలో భారత్‌లో చేరాలని కోరుకుంటారని ధీమా వ్యక్తం చేశారు.ఇరాన్ యుద్ధం వేళ పాకిస్తాన్ కవ్వింపు చర్యలు.. ఇండియా మీద దాడులు చేస్తామంటూ సంచలన వ్యాఖ్యలు..ఇరాన్ యుద్ధం వేళ పాకిస్తాన్ కవ్వింపు చర్యలు.. ఇండియా మీద దాడులు చేస్తామంటూ సంచలన వ్యాఖ్యలు..ముర్షిదాబాద్ వంటి సరిహద్దు జిల్లాల్లో చొరబాటుదారుల సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల స్థానిక జనాభా సమతుల్యత దెబ్బతింటోందని రాజ్‌నాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ఇప్పుడు శక్తివంతమైన దేశంగా ఎదిగిందని, ప్రపంచ దేశాలన్నీ మన వైపు చూస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఏ దేశమైనా మనల్ని రెచ్చగొట్టాలని చూస్తే, వారికి తగిన సమాధానం చెప్పే శక్తి మన సైన్యానికి ఉందని ఆయన స్పష్టం చేశారు. తన భూభాగం నుండి సాగుతున్న ఉగ్రవాదాన్ని అరికట్టకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. భారత సరిహద్దుల రక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ప్రతి అంగుళం భూమిని కాపాడుకుంటామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ ప్రసంగం ద్వారా ఆయన అటు అంతర్జాతీయంగా పాకిస్థాన్‌కు ఘాటైన హెచ్చరికను పంపడంతో పాటు, ఇటు దేశీయంగా జాతీయ భద్రత అంశంపై బీజేపీ పట్టును మరోసారి చాటిచెప్పారు. బెంగాల్ ప్రజలు దేశ రక్షణలో కీలక పాత్ర పోషించాలని, దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూసే శక్తులకు బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

# అద్దె ఎంత పెరిగినా అక్కడే ఉంటాం!

## ఫ్రెండ్స్ కోసం లక్షలు వదులుకుంటున్న బెంగళూరు కపుల్!

సాధారణంగా ఎక్కడైనా అద్దె భారీగా పెరిగితే వెంటనే మరో తక్కువ రేటు ఉన్న ఇంటి కోసం వెతుకుతాం. కానీ బెంగళూరు లో మాత్రం సీన్ రివర్స్ అవుతోంది. అద్దె 30 శాతం పెరిగినా సరే, పాత ఇంటిని లేదా పాత అపార్ట్‌మెంట్‌ను వదిలి వెళ్లడానికి చాలా మంది ఇష్టపడటం లేదు. తాజాగా ఒక ఐటీ జంట తీసుకున్న నిర్ణయం ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. డబ్బు కంటే సోషల్ లైఫ్, స్నేహాలే ముఖ్యమని వారు నిరూపిస్తున్నారు.అసలు ఏం జరిగిందిబెంగళూరులో నివసించే ఒక ఐటీ దంపతులు గతంలో నెలకు రూ. 57,000 అద్దె చెల్లించేవారు. అయితే ఇటీవల అదే గేటెడ్ కమ్యూనిటీలో అద్దెలు పెరగడంతో, వారు ఉంటున్న ఫ్లాట్ యజమాని అద్దె పెంచాడు. దాంతో వారు అదే సొసైటీలో మరో ఫ్లాట్‌ను వెతుక్కున్నారు. కానీ ఆ కొత్త ఫ్లాట్ అద్దె ఏకంగా రూ. 75,000! అంటే పాత అద్దె కంటే దాదాపు 30 శాతం ఎక్కువ. కేవలం తమ స్నేహితులకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఆ జంట అంత భారీ మొత్తాన్ని చెల్లించడానికి సిద్ధపడ్డారు.ఫ్రెండ్స్ అంటే



ఫ్యామిలీతో సమానంఈ నిర్ణయం వెనుక బలమైన ఎమోషనల్ కారణాలు ఉన్నాయని వారు చెబుతున్నారు. "మేము ఇక్కడ చాలా కాలంగా ఉంటున్నాం. ఇక్కడ ఉన్న వారంతా మాకు ఫ్యామిలీ మెంబర్స్ లాంటి వారు. మా పిల్లలకు ఇక్కడే మంచి స్నేహితులు ఉన్నారు. అత్యవసర సమయంలో లేదా మా పిల్లలను ఎవరి దగ్గరైనా వదిలి వెళ్లాల్సి వస్తే, వీరు మాకు కొండంత అండగా ఉంటారు" అని ఆ దంపతులు అభిప్రాయపడ్డారు. కొత్త చోటుకి వెళ్తే ఇలాంటి సపోర్ట్ సిస్టమ్ దొరకడం కష్టమని వారు భావిస్తున్నారు.మనీ వర్సెస్ మెంటల్ పీస్‌సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ రెడ్డిట్ లో ఈ విషయంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కొందరు ఇది ఆర్థికంగా తెలివైన నిర్ణయం కాదని అంటుంటే, మరికొందరు మాత్రం దీన్ని సమర్థిస్తున్నారు. "ఒక స్టేజ్ దాటిన తర్వాత కేవలం డబ్బు గురించి ఆలోచించడం మానేసి మనశ్శాంతికి ప్రాధాన్యత ఇస్తాం" అని ఒక నెటిజన్ కామెంట్ చేశారు. ముఖ్యంగా భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్తులైతే, తమ పిల్లల భద్రత కోసం ఇలాంటి తెలిసిన పరిసరాల్లో ఉండటమే మేలని ఎక్కువ మంది భావిస్తున్నారు.రెంట్ వర్సెస్ ఈఎంఐ ఆర్థిక కోణంలో చూసినా ఇది అంత నష్టదాయకం కాకపోవచ్చని కొందరి వాదన. ప్రస్తుతం బెంగళూరులో రూ. 75,000 అద్దె ఉన్న ఫ్లాట్ కొనాలంటే కనీసం నెలకు రూ. 2 లక్షల ఈఎంఐ కట్టాల్సి ఉంటుంది. దానికంటే అద్దెకు ఉండటమే బెటర్ అని వారు లెక్కలు వేస్తున్నారు. ఒకవేళ ఆ దంపతుల ఆదాయం నెలకు రూ. 8-9 లక్షల వరకు ఉంటే, ఈ 75 వేల అద్దె వారిపై పెద్దగా ప్రభావం చూపదని విశ్లేషకులు చెబుతున్నారు. ఏది ఏమైనా, మారుతున్న కాలంలో నగర జీవుల ప్రాధాన్యతలు మారుతున్నాయనడానికి ఈ బెంగళూరు జంట కథ ఒక ఉదాహరణగా నిలుస్తోంది.

# ఆఫర్ 80 లక్షలు.. చేతికి వచ్చేది 40..లక్షలు..

## మిగతాది ఏమైందో తెలిస్తే నవ్వు ఆపుకోలేరు!

సాధారణంగా ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు కోట్లల్లో ప్యాకేజీలు రావడం మనం చూస్తుంటాం. రీసెంట్ గా ఒక ఆఫ్రికన్ కంపెనీ ఐఐఎం కలకత్తా విద్యార్థులకు రూ. 80 లక్షల భారీ వార్షిక వేతనాన్ని ఆఫర్ చేసింది. వినడానికి ఇది ఎంతో గొప్పగా అనిపించినా దాని వెనుక ఉన్న అసలు ట్విస్ట్ తెలిస్తే మాత్రం ఎవరైనా అవాక్కవ్వాల్సిందే. ప్రస్తుతం ఈ స్టోరీ సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో ఉంది.అసలు విషయం ఏంటంటేపాపులర్ పాడ్‌కాస్టర్ కుశాల్ లోధా.. ప్రముఖ ఎంట్రప్రెన్యూర్ అమన్ దత్తర్వాల్‌తో జరిపిన సంభాషణలో ఈ విషయాన్ని బయటపెట్టారు. ఐఐఎం కలకత్తా ప్లేస్‌మెంట్స్ సమయంలో ఒక ఆఫ్రికన్ కంపెనీ రూ. 80 లక్షల సీటీసీ ఆఫర్ చేసింది. అయితే, ఆ 80 లక్షల్లో కేవలం 40 లక్షలు మాత్రమే ఫిక్స్‌డ్ శాలరీ అని, మిగిలిన 40 లక్షలు 'కిడ్నాపింగ్ ఇన్సూరెన్స్' కోసం కేటాయించారని ఆయన చెప్పారు. అంటే ఒకవేళ సదరు ఉద్యోగిని



ఎవరైనా కిడ్నాప్ చేస్తే, ఆ డబ్బును విమోచన క్రయధనం కింద చెల్లించడానికి కంపెనీ ముందే పక్కన పెడుతుందన్నమాట!సీటీసీ వర్సెస్ ఇన్ హ్యాండ్ శాలరీచాలా కంపెనీలు తమ ప్యాకేజీని పేపర్ మీద చాలా ఎక్కువగా చూపిస్తాయి. దీన్నే 'సీటీసీ' లేదా కాస్ట్ టు కంపెనీ అంటారు. కానీ, చేతికి వచ్చే సరికి ఆ మొత్తం సగానికి తగ్గిపోతుంటుంది. ఈ కిడ్నాపింగ్ ఇన్సూరెన్స్ వ్యవహారంపై కుశాల్ లోధా స్పందిస్తూ.. "ఇదొక రకమైన స్కామ్ లాంటిదే. ఆ దేశాల్లో కిడ్నాప్‌లు చాలా కామన్ కాబట్టి కంపెనీలు ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటాయి. కానీ దాన్ని కూడా శాలరీ ప్యాకేజీలో కలపడమే విడ్డూరం" అని పేర్కొన్నారు.నెటిజన్ల ఫన్నీ రియాక్షన్స్ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. "అట్లీస్ట్ వాళ్ళ దేశంలో న్యాయవ్యవస్థ బాలేదని నిజాయితీగా ఒప్పుకున్నారు" అని ఒకరు కామెంట్ చేయగా, మరొకరు "మరి కిడ్నాపర్లు 41 లక్షలు డిమాండ్ చేస్తే.. ఆ అదనపు లక్షను వచ్చే ఏడాది శాలరీలో క్లెయిమ్ చేసుకోవచ్చా" అంటూ జోకులు పేలుస్తున్నారు. మరికొందరైతే "మన ఫ్రెండ్స్ తోనే కిడ్నాప్ చేయించుకుని, ఆ 40 లక్షలు కొట్టేయొచ్చు కదా" అంటూ ఫన్నీ సలహాలు ఇస్తున్నారు.టోలారం గ్రూప్ పేరు ప్రముఖంగా వినిపిస్తోందిఈ వింత ఆఫర్ ఇచ్చిన కంపెనీ 'టోలారం గ్రూప్' అయి ఉండొచ్చని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. కేవలం ఐఐఎం మాత్రమే కాకుండా, కొన్ని ఇంజనీరింగ్ కాలేజీల్లో కూడా ఈ కంపెనీ ఇలాంటి వింతైన ప్యాకేజీ స్ట్రక్చర్ ను ఫాలో అవుతుందని నెటిజన్లు చెబుతున్నారు. ఏది ఏమైనా, ఉద్యోగంలో చేరే ముందు కేవలం పెద్ద అంకెలను చూసి మోసపోకుండా, ఇన్ హ్యాండ్ శాలరీ ఎంతో తెలుసుకోవడం చాలా ముఖ్యం అని ఈ ఘటన మరోసారి నిరూపించింది.

# హైదరాబాద్‌లో రూ.64.35 లక్షల డ్రగ్స్ స్వాధీనం



హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుకున్నారు. చిలకలగూడ, ఆదిభట్ల, సనత్ నగర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి, రూ.64.35 లక్షల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ వెల్లడించారు.ఈ ఆపరేషన్‌లో డ్రగ్స్‌తో పాటు రూ.50,000 నగదు, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులు గతంలో ఉద్యోగాలు చేశారని, ఆ తర్వాత టైల్స్ వ్యాపారం నిర్వహించినట్లు చెప్పారు. ఈ వ్యాపారంలో నష్టం రావడంతో ఆ తర్వాత డ్రగ్స్ వ్యాపారంలోకి వచ్చారని చెప్పారు.

# 'స్పిరిట్' సందడి.. చారిత్రాత్మక థియేటర్‌లో ప్రభాస్ షూటింగ్, అభిమానుల హడావిడి!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'స్పిరిట్' ఒకటి. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రభాస్ కెరీర్‌లోనే అత్యంత ఇంటెన్స్ పాత్రల్లో ఒకటిగా భావిస్తున్న ఈ చిత్రంలో ఆయన పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభం కావడం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. సినిమా తాజా షెడ్యూల్ కోసం చిత్రబృందం హైదరాబాద్‌లోని బాలానగర్ ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధ విమల్ థియేటర్‌ను ఎంపిక చేసింది. దాదాపు నాలుగు దశాబ్దాలకుపైగా చరిత్ర కలిగిన ఈ థియేటర్ నగరంలోని ప్రముఖ సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఎన్నో సూపర్ హిట్ సినిమాలకు సాక్ష్యంగా నిలిచిన ఈ థియేటర్ ఇప్పుడు 'స్పిరిట్' షూటింగ్‌కు వేదికగా మారింది. ఈ ప్రత్యేక షెడ్యూల్‌లో కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ కూడా ఈ షూట్‌లో పాల్గొననున్నారని సమాచారం. ఆయన థియేటర్‌కు రానున్నారనే వార్త బయటకు రావడంతో అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుంటున్నారు. షూటింగ్ ప్రదేశం చుట్టూ అభిమానుల రద్దీ పెరగడంతో చిత్ర యూనిట్ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసింది. పోలీసుల సహకారంతో జనసందోహాన్ని నియంత్రించే చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. 'స్పిరిట్' చిత్రాన్ని సందీప్ రెడ్డి వంగా తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా రూపొందిస్తున్నారు. యాక్షన్, ఎమోషన్, క్రైమ్ డ్రామా అంశాల కలయికతో ఈ కథ రూపొందుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ప్రభాస్‌ను ఇప్పటివరకు చూడని కొత్త కోణంలో ఈ సినిమాలో చూపించబోతున్నారనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ నటి త్రిప్తి దిమ్రి నటిస్తోంది. 'యానిమల్' తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ఆమె నటిస్తున్న మరో చిత్రం కావడం విశేషం. మరోవైపు ప్రముఖ నటుడు వివేక్ ఒబెరాయ్ ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఇది ఆయనకు టాలీవుడ్‌లో పూర్తి స్థాయి తొలి భారీ ప్రాజెక్ట్‌గా చెప్పుకోవచ్చు. అలాగే కాంచన, ఐశ్వర్య దేశాయ్ తదితరులు కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది.

# రవితేజ అభిమానులకి గుడ్ న్యూస్.. 'ఇరుముడి' నుంచి భారీ అప్‌డేట్




మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం ప్రకటించిన నాటి నుంచే సినీ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. గత కొంతకాలంగా విభిన్నమైన కథలు, కొత్త తరహా పాత్రలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తున్న రవితేజ, ఈసారి కూడా మరో ఆసక్తికర కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే చిత్రానికి సంబంధించిన పోస్టర్లు, ప్రచార కార్యక్రమాలు మంచి స్పందనను అందుకోగా, తాజాగా చిత్రబృందం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న గ్లింప్స్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. 'హార్ట్ ఆఫ్ ఇరుముడి' పేరుతో ప్రత్యేక గ్లింప్స్‌ను జూన్ 3న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ కూడా అభిమానులను ఆకట్టుకుంటోంది. సాధారణ యాక్షన్ లేదా మాస్ ప్రమోషన్‌కు భిన్నంగా, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇచ్చేలా పోస్టర్ డిజైన్ చేయడం ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా 'హార్ట్ ఆఫ్ ఇరుముడి' అనే టైటిల్‌తో గ్లింప్స్‌ను తీసుకురావడం వల్ల సినిమాలో ఎమోషనల్ కంటెంట్‌కు కీలక స్థానం ఉంటుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. దర్శకుడు శివ నిర్వాణ సినిమాల్లో భావోద్వేగాలు, మానవ సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. 'ఇరుముడి'లో కూడా అదే తరహా భావోద్వేగాలతో పాటు రవితేజ మాస్ ఇమేజ్‌కు తగ్గ అంశాలను బ్యాలెన్స్‌గా చూపించనున్నట్లు తెలుస్తోంది. అందుకే ఈ గ్లింప్స్‌పై అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఒకప్పుడు రవితేజ సినిమా అంటే కేవలం అభిమానులే కాదు, సాధారణ ప్రేక్షకులు కూడా ఆసక్తిగా ఎదురుచూసే పరిస్థితి ఉండేది. ఇప్పుడు 'ఇరుముడి' విషయంలో కూడా అలాంటి వాతావరణమే కనిపిస్తోంది. సినిమా ప్రకటన నుంచి వస్తున్న ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో మంచి స్పందనను అందుకుంటోంది. ముఖ్యంగా రవితేజను కొత్త కోణంలో చూపించబోతున్నారనే ప్రచారం సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవాని శంకర్ కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతున్నట్లు సమాచారం. మరోవైపు సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ సినిమాకు స్వరాలు సమకూరుస్తున్నారు. భావోద్వేగ కథాంశాలకు సంగీతం ద్వారా మరింత బలం చేకూర్చడంలో జీవీ ప్రకాష్ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అందరి దృష్టి జూన్ 3న విడుదల కానున్న 'హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్‌పైనే ఉంది. ఈ గ్లింప్స్ సినిమా కథ, రవితేజ పాత్ర, భావోద్వేగాల తీవ్రతపై కొంత క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది.

# అభిమానుల కోసం రక్తమైనా చిందిస్తా



స్టార్ హీరో రామ్‌చరణ్ తన కొత్త సినిమా 'పెద్ది' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో అభిమానులను ఉత్సాహపరిచారు. బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా జూన్ 4న పాన్ ఇండియా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటించింది. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ.. విజయవాడ నా అదృష్టమైన నగరం. ఇక్కడే 'ఇంద్ర', 'ఖైదీ నంబర్ 150' సెలబ్రేషన్స్ చేశాం. ఆర్టిస్ట్‌గా నేను ఎన్నో కథలు వింటాను. అందులో కొన్ని నచ్చుతాయి. ఇంకొన్ని ఆశ్చర్యపరుస్తాయి. కానీ ఈ కథ విన్నప్పుడు హృదయానికి హత్తుకుంది. ఈ కథ విన్నప్పుడు హృదయానికి హత్తుకుంది. నాన్నగారు చెప్పినట్లు ఇలాంటి కథ పదేళ్లకు ఒకసారి మాత్రమే వస్తుంది. ఇంతమంచి కథను నా దగ్గరకు తీసుకొచ్చిన సుకుమార్‌గారికి ధన్యవాదాలు. బుచ్చిబాబు దీనిని ఒక సినిమా కథలా చెప్పలేదు. ఒక వ్యక్తి ప్రయాణంలా చెప్పారు. నా సినిమాల లైబ్రరీలో ఈ చిత్రం టాప్‌లో నిలుస్తుంది. ఈ సినిమాని చాలా ఇష్టం, ప్రేమతో చేశాను. ఇలాంటి కథ కోసం కాకపోతే ఇంకెప్పుడు కష్టపడతాం? ఇది పడి లేచిన మనిషి ప్రయాణం. ఈ చిత్రంతో బుచ్చిబాబు ఇండియాలో టాప్ డైరెక్టర్స్ జాబితాలో నిలుస్తారు. అభిమానుల కోసం చేతులు విరగొట్టుకుని పనిచేయడమే కాదు. రక్తమైనా చిందిస్తా. నాకు తెలిసిందల్లా సినిమాయే. నేను చనిపోయే వరకూ మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేస్తా అంటూ చరణ్ తన అభిమానులపై ప్రేమను వ్యక్తం చేశారు.


# అప్పుడే మరో సినిమా.. గోపీచంద్ 34 షూటింగ్ షురూ.. !



టాలీవుడ్ యాక్టర్ గోపీచంద్ ప్రస్తుతం 'భరత వర్ష : సాగా ఆఫ్ శూల' సినిమాలో నటిస్తున్నాడని తెలిసిందే. సంకల్ప్ రెడ్డి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. కాగా ఈ మూవీ సెట్స్‌పై ఉండగానే గోపీచంద్ 34గా రాబోతున్న మరో సినిమాను కూడా లాంచ్ చేశాడు. పాపులర్ స్టంట్ మాస్టర్ వీ వెంకట్ ఈ సినిమాతో డెరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తుండటంతో మూవీ లవర్స్‌లో సినిమాపై ఆసక్తి నెలకొంది.

మేలో లాంచ్ అయిన ఈ సినిమా షూటింగ్ ఫైనల్‌గా నేడు షురూ అయింది. ఈ చిత్రంలో అనార్కలి నాజర్ ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. 'యాత్ర', 'ఆనందో బ్రహ్మ' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన 70ఎఎ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి రీసెంట్‌గా విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకుల్లో అంచనాలను పెంచేస్తుంది. మండుతున్న ఆకాశం, ఒక కొండపై గంభీరంగా నిలబడిన బ్లాక్ పాంథర్ విజువల్స్ చూస్తుంటే, ఇంటెన్స్ మైథికల్ యాక్షన్ డ్రామాగా సినిమా ఉండబోతుందని స్పష్టమవుతోంది. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, రామకృష్ణ-మౌనిక ప్రొడక్షన్ డిజైనర్లుగా వ్యవహరిస్తున్నారు.

# స్వయంభూ కోసం నిఖిల్ ఇంత కష్టపడ్డారా?'



నిఖిల్ హీరోగా వస్తోన్న పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ' . ఈ మూవీకి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో సంయుక్త మీనన్, నభా నటేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఈ మూవీ రిలీజ్ తేదీని ఇంకా ప్రకటించలేదు. అయితే ఇవాళ నిఖిల్ బర్త్ డే కావడంతో మేకర్స్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఈ మూవీలో యోధుడిగా కనిపించేందుకు నిఖిల్ ఎంతలా కష్టపడ్డారో చూపించే వీడియోను రిలీజ్ చేశారు. యోధుడిలా మారేందుకు 45 రోజులు చాలా కఠినమైన శిక్షణ.. వియత్నాం పోరాట రోజులను పుట్టినరోజు కానుకగా చూపించినందుకు టీమ్ స్వయంభూకి ధన్యవాదాలు.. కష్టపడకుండా ఫలితం రాదు.. అంటూ నిఖిల్ ట్విటర్‌లో పోస్ట్ చేశారు. త్వరలోనే స్వయంభూ థియేటర్లలోకి వస్తుందంటూ ఫ్యాన్స్‌లో జోష్ నింపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ వీడియోను మీరు కూడా చూసేయండి.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.